

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 83 | ఎడిటర్ : బరిగెల శివ | ఆదివారం 22, ఫిబ్రవరి 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్






# రైతులకు భరోసా ఏది ?



డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

రైతులను అరిగోస పెట్టుకుంటున్నారు

తెలంగాణ రైతాంగానికి కష్టకాలం

రైతులంటే ప్రభుత్వాలకి ఎందుకు ఇంత చిన్నచూపు

రైతులను ప్రభుత్వాలు ఆదుకునేది ఇంకెప్పుడు

సకాలంలో అందని రైతు భరోసా

యూరియాకు గోసబడ్డ రైతులు నాటు, కలుపులకు గోసబడుతున్నారు

పంటలు పండిస్తే ఒక బాధ పండించకపోతే మరో బాధ

ఎటు చేసి బాధపడేది రైతులే

రైతు ప్రభుత్వమని ఎలా చెప్పుకుంటూరు


హామీల అమలను విడమరుస్తున్న ప్రభుత్వాలను అడిగినాథుడే లేడు

డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

రైతులను అరిగోసపెట్టడం ప్రభుత్వాలకు ఎంత మాత్రం మంచిది కాదని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు.తెలుగు రాష్ట్రాల్లో రైతుల జీవితాలు అగమ్య గోచరంగా మారిపోతున్నాయని బాధ వ్యక్తం చేశారు.సకాలంలో రైతులకు పంట లాభసాహకమైన రుణం రావాల్సి ఉంటుండగా ప్రభుత్వాల మొండి వైఖరితో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వాపోయారు.సంవత్సర కాలం పాటు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో రైతులకు రుణం రాకపోవడం ఎంతో విచారకరమన్నారు.సుమారుగా కోటిన్నరకు పైన సాగు బడికి అనుకూలంగా ఉంటున్నటువంటి విస్తీర్ణపు భూమికి రైతంగానికి ఆర్థిక సహాయం అందించడంలో రైతు భరోసా రైతు బృతి పేర్ల మీద సమయానుకూలంగా రైతులకు పూర్తిస్థాయిలో అన్యాయం జరుగుతుందని ఒక్కానించి చెప్పారు.రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు అదుపుతప్పిన మాటలతో అదుపుతప్పిన అబద్ధాలతో పదేపదే

- మిగతా 2లో..



## ఆయేషా మీరా హత్య కేసు

సీబీఐ తుది నివేదికకు కోర్టు ఆమోదం

ఆయేషా మీరా హత్య కేసును ముగించిన విజయవాడ సీబీఐ కోర్టు

ఆమె అవశేషాలను తల్లిదండ్రులకు అప్పగించాలని కీలక ఆదేశం

ఫిబ్రవరి 27న తెనాలిలో అంత్యక్రియలు జరపాలని నిర్దేశం

ప్రభుత్వ భద్రత నడుమ అంత్యక్రియలు జరపాలని స్పష్టం చేసిన న్యాయస్థానం



2

## నేను పార్టీ అధ్యక్షుడిని అయ్యే నాటికి పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉంది: రేవంత్ రెడ్డి

పార్టీలో కొందరి నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నానని తెలిపిన రేవంత్ రెడ్డి

నేతలందరినీ కలిసి తన ఆలోచన చెప్పి వారిని ఒప్పించానన్న ముఖ్యమంత్రి

అందరి కృషి వల్ల తెలంగాణలో పార్టీ తిరిగి పుంజుకున్నదన్న ముఖ్యమంత్రి



5

## తిరుమలలో పోటెత్తిన భక్తులు

2

సర్వదర్శనానికి 20 గంటలు.. - తిరుమలలో భారీగా పెరిగిన భక్తుల రద్దీ

వైకుంఠం కాంప్లెక్స్ దాటి శిలాతోరణం వరకు క్యూలైన్లు

## గద్వాల జిల్లాలో డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఫ్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదం

అయిజ పట్టణంలో రాయచూర్ వెళ్లే మార్గంలో ప్రమాదం

షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం

మంటలను అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది



2




## ఎంపీటీసీ-జడ్పీటీసీకి ఎండ్ కార్డ్..?

మూడంచెల పంచాయతీ రాజ్ వైపు సర్కార్ అడుగులు

స్థానిక సంస్థల్లో భారీ మార్పులు..?

పరోక్ష ఎన్నికలపై ప్రభుత్వ కసరత్తు

2

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# ఆయేషా మీరా హత్య కేసు

**సీబీఐ తుది నివేదికకు కోర్టు ఆమోదం**
**ఆయేషా మీరా హత్య కేసును ముగించిన విజయవాడ సీబీఐ కోర్టు**
**ఆమె అవశేషాలను తల్లిదండ్రులకు అప్పగించాలని కీలక ఆదేశం**
**ఫిబ్రవరి 27న తెనాలిలో అంత్యక్రియలు జరపాలని నిర్దేశం**
**ప్రభుత్వ భద్రత నడుమ అంత్యక్రియలు జరపాలని స్పష్టం చేసిన న్యాయస్థానం**

**విజయవాడ, జై భీమ్ న్యూస్**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర సంచలనం సృష్టించిన బీఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్య కేసులో విజయవాడలోని సీబీఐ ప్రత్యేక కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు దర్యాప్తును ముగిస్తున్నట్లు ప్రకటించిన న్యాయస్థానం.. వైద్య బృందం సేకరించిన ఆయేషా భౌతిక అవశేషాలను ఆమె తల్లిదండ్రులకు అప్పగించాలని సీబీఐని ఆదేశించింది. ఫిబ్రవరి 27న తెనాలిలో ప్రభుత్వ భద్రత నడుమ మత సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించాలని స్పష్టం చేసింది. ఆయేషా హత్య కేసులో నిందితులను గుర్తించడానికి తగిన ఆధారాలు లభించలేదని సీబీఐ ఇటీవల కోర్టుకు తుది నివేదిక సమర్పించింది. ఈ నివేదికను తాజాగా న్యాయస్థానం ఆమోదించింది. దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు ఆయేషా మీరా మృతదేహానికి రెండో సారి పోస్టుమార్టం నిర్వహించారు. గాంధీ ఆసుపత్రి వైద్యుల అభిప్రాయం తీసుకున్న అనంతరం అవశేషాలను సీబీఐ కోర్టు ముందుంచారు. ఈ క్రమంలో తమ కుమార్తె అవశేషాలను అంత్యక్రియల నిమిత్తం తమకు అప్పగించాలని కోరుతూ ఆయేషా తల్లిదండ్రులు షంషాద్ బేగం, సయ్యద్ ఇక్బాల్ బాషా పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు, ఫిబ్రవరి 27వ తేదీ తెనాలిలో అంత్యక్రియలు జరపాలని ఆదేశించింది. ఈ ప్రక్రియ మొత్తాన్ని సీబీఐ, రెవెన్యూ, పోలీసు అధికారులు, మత పెద్దల సమక్షంలో వీడియో రికార్డింగ్ చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చింది. అవశేషాల తరలింపునకు ప్రత్యేక వాహనం, ఎస్కార్ట్, భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. 2007లో విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నంలోని హాస్టల్‌లో ఆయేషా మీరా దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే.

# ఎంపీటీసీ-జడ్పీటీసీకి ఎండ్ కార్డ్..?

**మూడంచెల పంచాయతీ రాజ్ వైపు సర్కార్ అడుగులు**
**స్థానిక సంస్థల్లో భారీ మార్పులు..?**
**పరోక్ష ఎన్నికలపై ప్రభుత్వ కసరత్తు**




**హైదరాబాద్ (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటు చేసుకునే సూచనలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో అమల్లో ఉన్న ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థను రద్దు చేసి మూడంచెల పంచాయతీ రాజ్ విధానాన్ని అమలు చేసే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు సమాచారం. ఈ నిర్ణయం తీసుకుంటే గ్రామీణ రాజకీయాల్లో పెద్ద మార్పు రావడం ఖాయం. ఇటీవల జరిగిన సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి అనుకూల ఫలితాలు రావడంతో ఇప్పుడు మండల, జిల్లా స్థాయి ఎన్నికలపై దృష్టి కేంద్రీకరించినట్టు తెలుస్తోంది. అయితే ఈ ఎన్నికలను యథాతథంగా నిర్వహించాలా? లేక వ్యవస్థనే మార్చాలా? అన్నదానిపై సర్కార్ లోతైన చర్చలు జరుపుతున్నట్టు సమాచారం.

**నేరుగా ఎన్నికల బదులు పరోక్ష పద్ధతి..?**

ప్రస్తుతం ప్రజలు నేరుగా ఎంపీటీసీలు, జడ్పీటీసీలను ఎన్నుకుంటున్నారు. కానీ కొత్త ప్రతిపాదన ప్రకారం సర్పంచులు కలిసి ఎంపీపీలను ఎన్నుకోవడం, ఎంపీపీలు కలిసి జడ్పీ ఛైర్మన్లను ఎన్నుకోవడం, వంటి పరోక్ష విధానాన్ని అమలు చేసేలా చట్ట సవరణలు చేసే అవకాశమున్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వ వర్గాల అభిప్రాయం ప్రకారం ఐదంచెల వ్యవస్థ వల్ల ఖర్చులు పెరుగుతున్నాయి. ఎన్నికల నిర్వహణ, జీతభత్యాలు, పరిపాలనా వ్యయాలు అంతా కలిపి భారీ భారం అవుతున్నాయని వాదిస్తున్నారు. పైగా ఎంపీటీసీలు, జడ్పీటీసీలకు పరిపాలనా అధికారాలు పరిమితంగానే ఉన్నాయని ప్రభుత్వం భావిస్తున్నట్టు టాక్.

**రాజకీయ లెక్కలు కూడా పనిచేస్తున్నాయా..?**

సర్పంచ్ ఎన్నికల్లో మెజార్టీ పంచాయితీలను గెలుచుకున్న కాంగ్రెస్ పార్టీకి పరోక్ష ఎన్నికలు అనుకూలంగా మారవచ్చని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. సర్పంచుల బలం ఆధారంగా ఎంపీపీలు, జడ్పీ ఛైర్మన్లను సులభంగా గెలుచుకునే అవకాశం ఉందని అధికార పార్టీ లెక్కలు వేసుకుంటోందన్న చర్చ సాగుతోంది.

**జీహెచ్ఎంసీ ఎన్నికలు కూడా గందరగోళంలోనే?**

ఇదిలా ఉండగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపాలిటీ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) ఎన్నికలపై కూడా స్పష్టత లేదు. ప్రస్తుత కౌన్సిల్ గడువు ముగిసినా న్యాయపరమైన వివాదాలు ఎన్నికలకు అడ్డంకిగా మారాయి. హైదరాబాద్ పరిసర ప్రాంతాల 27 మున్సిపాలిటీల విలీనం, వార్డుల సంఖ్యను 300కు పెంచే నిర్ణయంపై వివాదం నెలకొంది. వార్డుల పునర్విభజన శాస్త్రీయంగా జరగలేదని పలు పిటిషన్లు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో కోర్టు తీర్పు వచ్చే వరకు ఎన్నికలు జరిగే అవకాశాలు తగ్గిపోయాయి. జనగణన నోటిఫికేషన్ తర్వాత వార్డుల విభజన చేయరాదని కేంద్ర నాయకులు అభ్యంతరం వ్యక్తం చేయడం కూడా పరిస్థితిని మరింత క్లిష్టం చేసింది.

**23న క్యాబినెట్ కీలక భేటీ**

ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థను కొనసాగించాలా? లేక మూడంచెల పద్ధతికి మారాలా? అన్నదానిపై ఈ నెల 23న జరిగే క్యాబినెట్ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకునే అవకాశముందని తెలుస్తోంది. ఈ నిర్ణయం గ్రామీణ రాజకీయాల్లో భారీ మార్పులకు దారితీయొచ్చు. ప్రజలకు నేరుగా ఓటు హక్కు తగ్గుతుందా? లేక పరిపాలన మరింత సమర్థవంతం అవుతుందా? అన్నది చూడాలి. మొత్తానికి స్థానిక సంస్థల రాజకీయాలు మరో మలుపు తిరగబోతున్నాయన్నది మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది.

# రైతులకు “భరోసా” ఏది ?

మొదటి పేజీ తరువాయి

మాట మారుస్తూ రైతులను మోసగిస్తున్నారన్నారు.ఒకవైపు యూరియా బస్తాలు సకాలంలో అందక హరిగోశపడుతున్న రైతులకు రుణమాఫీ పేరుమీద పొందుకున్న సొమ్మంతా బ్యాంకు రుణాల అప్పులకే పోగా ప్రస్తుతం రావాల్సిన రైతు భరోసా డబ్బులు ఇంకా అందకపోవడంతో రైతాంగం తీవ్ర నిరాశలో ఉన్నారని తెలిపారు.రైతుల విశ్వాసాన్ని రైతుల ఆత్మగౌరవాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వాలు సకాలంలో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.రైతుల పట్ల చిత్తశుద్ధి లేని ప్రభుత్వాలే రైతులను మోసగిస్తూ రైతు ప్రభుత్వాలని చెప్పుకుంటున్నాయన్నారు అన్ని రకాల అభివృద్ధి పనులకు కావలసినంత సొమ్మును విడుదల చేస్తున్న ప్రభుత్వాలు కేవలం రైతు భరోసా సంక్షేమంలో రైతులకు చెందాల్సిన అభివృద్ధి అనేసరికి పూర్తిగా వెనుకబాటు తనాన్ని ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు.పంట నష్టం వాటిల్లుతున్న ప్రతి సందర్భంలో ప్రభుత్వ యంత్రాంగాలు రైతులను ఆదుకోలేకపోయాయని దానివల్ల రైతులకు తీవ్రమైన నష్టాలు సంభవించాయని వాటన్నిటిని పూడ్చుకోలేని స్థితిలో రైతులు బాధపడుతూనే మరల పంటలు వేసుకునే సమయానికి నాట్ల కోసం కలుపు కోసం ప్రభుత్వాలు రైతులకు భరోసా కల్పించేది పోయి రైతులకు డబ్బులు చెల్లించకుండా తీవ్రమైన నిరాశను మిగిలిస్తుందన్నారు.రైతు పండిస్తేనే రాజు లాగా మూడు పూటలు అన్నం తినే ప్రజలు కూడా రైతులకు వెన్నుదండగా ఉండలేకపోవడం బాధాకరమన్నారు. తెలుగు రాష్ట్రాలవ్యాప్తంగా లెక్కకు మించిన ఆస్తులు సంపాదిస్తున్న సంపన్నుల ఆస్తులను గుర్తించి వాటిని విచారించి అక్రమంగా సంపాదిస్తున్న ఆస్తులను ప్రభుత్వ ధనంలో కలపాలని డిమాండ్ చేశారు. ఏ ప్రభుత్వమైనా అధికారంలోనికి రావడానికి మొదటగా ఉపయోగించుకునే సంక్షేమం ఏదైనా ఉందంటే అది కేవలం రైతు సంక్షేమమేనని ఎన్నికల ముందు రైతులను విధాల ఆదుకుంటామని ప్రమాణాలు చేస్తూ ప్రత్యక్ష ఎన్నికల్లో అధికారంలోకి రావడానికి అనేక రకాల అబద్ధాలు ఆడుతూనే పలు సందర్భాల్లో సంస్కారహీనంగా బూతులు తిట్టడం ఏమాత్రం మంచిది కాదని గుర్తుకు చేశారు.ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం కోసం ప్రశ్నిస్తున్న వాళ్లపై పలు రకాల కేసులు పెడుతున్న ప్రభుత్వాలు ప్రజాస్వామ్య విలువలను దిగజార్చడం కోసం రైతు సంక్షేమాన్ని పావుగా వాడుకుంటున్నారని గుర్తు చేశారు.రైతులకు చేసే న్యాయం భగవంతుడి స్వరూపాలకు చేసిన వాళ్లతో సమానంగా గుర్తించాల్సి ఉందన్నారు.రైతులకు చేసే సహాయం ప్రతి పేదవాని ఇంటికి నాలుగు మెతుకులను అన్నం రూపంలో అందించే వాళ్ళంగా గుర్తింపు పొందగలమన్న సంగతిని ఎవరము మర్చిపోవద్దన్నారు.రాజకీయ నాయకులు ఏం మాట్లాడినా ఏ పని చేసిన చట్టాలు న్యాయస్థానాలు వాళ్లని ఏమీ చేయలేవనే అహం ఉన్నంతకాలం రాజ్యాంగ విలువలు రాజకీయాలలో పనికిరాకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.కేవలం రైతులను మాత్రమే పట్టించుకోకుండా పరిపాలన చేస్తున్న ప్రభుత్వాలు మిగతా సంక్షేమాలనైన అనుకున్న స్థాయిలో అమలుపరస్తారేమోనని ప్రజలంతా ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తుండగా రాజకీయ నాయకులు అబద్ధాల మీద అబద్ధాలు వాడుతూ ప్రజాభివృద్ధిని ప్రజా సంక్షేమాన్ని దాటవేస్తూ వ్యక్తిగత అభివృద్ధిని వ్యక్తిగత సంక్షేమాన్ని పెంపొందించుకుంటున్నారని తీవ్రంగా విమర్శించారు.ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టడం అణిచివేయడం గమనిస్తుంటే రైతులకు సంబంధించి మాట్లాడనివ్వకుండా కట్టడం చేస్తున్నారని గుర్తుచేశారు.బరితెగించి కొట్లాడి అధికారం సంపాదించుకున్నామని తెలుపుతున్న ప్రభుత్వాలు ప్రజలకు మేలు చేయకుండా ప్రభుత్వ అధికారులను వాడుకుంటూ ప్రజా సంక్షేమానికి తీరని అన్యాయం చేస్తున్నారని ప్రభుత్వాధికారులందరూ ప్రజాప్రతినిధులకు ఊడిగం చేయడానికి మాత్రమే పనికి వస్తున్న రీతిలో రైతులు ప్రజలు క్షేత్రస్థాయి విమర్శలు చేస్తున్నారన్నారు.ప్రజలను రైతులను మోసగించాలనే ఉద్దేశం ప్రభుత్వాలకు లేనప్పుడు ప్రజల పట్ల రైతుల పట్ల ఎందుకు ఇంతటి నిర్లక్ష్యపు పరిపాలనలను కొనసాగిస్తున్నారో తెలుగు జాతీయలకు ఇరు రాష్ట్రాల రైతులకు సమాధానం చెప్పండి అంటూ నిలదీశారు.రేపు మాపు అనుకుంటూ కాలం గడపడం మినహాయిస్తే సకాలంలో రైతులను ఆదుకొని సగౌరవమైన మర్యాదలను కాపాడుకుందామన్న ఆలోచన ప్రభుత్వాలకు లేకుండా పోతుందన్నారు.రైతులకు చేసే నష్టం ప్రభుత్వాలకు క్రమక్రమేనా పరువుకు సంబంధించిన నష్టాన్ని తీసుకువస్తుందని ఇకనైనా గుర్తించవలసిందిగా హెచ్చరించారు.ప్రతి నియోజకవర్గంలో రైతు భరోసా నిధులు ఎంతవరకు చెల్లించబడుతున్నాయో ఎన్ని లక్షల మంది రైతులకు ఉపయోగం జరుగుతుందో వాటన్నింటి గణాంకాలను ప్రభుత్వాలు ప్రజలకు రైతులకు సూటిగా తెలియజేయాల్సిన అవసరం తప్పకుండా ఉందన్నారు.రైతు పండిస్తున్న పంటతో అన్నం తింటూ అభివృద్ధి చెందుతున్న నాయకులు ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు వ్యాపారస్తులు రైతు నష్టాన్ని దగ్గరిండి చూస్తూనే రైతుకు సాయం చేద్దామని ఆలోచన మాత్రం కల్పించుకోలేకపోవడం చివరకు రైతు సంక్షేమ అభివృద్ధి ఎటువైపు దారితీస్తుందో అంతుచిక్కని ప్రశ్నగా మిగిలిపోయిందన్నారు.రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని రైతు బాగుపడితేనే దేశం అభివృద్ధి చెందుతుందని రైతు సామ్రాజ్యాన్ని అభివృద్ధి పరచడం కోసం అన్ని వర్గాలు అన్ని పార్టీలు అన్ని ప్రభుత్వ యంత్రాంగాలు ఐక్యంగా సహాయపడగలరని సూచించారు లేనియెడల రైతులపై చూపిస్తున్న అశ్రద్ధ ప్రభుత్వాలను కూల దోస్తుందన్న సంగతిని ఎట్టి పరిస్థితిలో మర్చిపోకూడదన్నారు.రైతుల బలవన్మానాలు,రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్న నేటి దినాల్లో అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రజాసంక్షేమంలో దూసుకుపోతున్నామంటూ ప్రజాభివృద్ధిలో ముందుంటున్నామంటే దొంగ సాకుల ప్రగల్భాలు పలకడం పచ్చి మోసమన్నారు.



# ఏది మాట్లాడితే అది చెల్లుబాటు అవుతుందనుకోవద్దు

**యూట్యూబర్ అన్వేశ్ పై కరాటే కల్యాణి ఫైర్**
**అన్వేశ్‌ను భారత్‌కు రప్పించి, ఆయన పాస్‌పోర్ట్ రద్దు చేయించే వరకు తన పోరాటం ఆపబోనన్న కరాటే కల్యాణి**
**యూట్యూబ్ పోతుందనే భయంతోనే అన్వేశ్ మాట్లాడుతున్నారని ఎద్దేవా**
**తన ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడి**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**



ప్రముఖ యూట్యూబర్, ప్రపంచ యాత్రికుడు ‘నా అన్వేషణ’ అన్వేశ్‌పై సినీ నటి కరాటే కల్యాణి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. హిందూ దేవుళ్లను, భారతదేశాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన అన్వేశ్‌ను భారత్‌కు రప్పించి, ఆయన పాస్‌పోర్ట్ రద్దు చేయించే వరకు తన పోరాటం ఆపబోనని ఆమె స్పష్టం చేశారు. ఫాలోవర్స్ ఉన్నంత మాత్రాన ఏది మాట్లాడినా చెల్లుబాటు అవుతుందని భావించడం సరికాదని హెచ్చరించారు. హైదరాబాద్‌లో నిన్న మీడియాతో మాట్లాడిన కరాటే కల్యాణి.. అన్వేశ్‌పై చట్టపరమైన చర్యల గురించి వివరించారు. హిందూ దేవతలను అవమానించారనే ఆరోపణలతోనే తాము పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, దాని ఆధారంగా కేసు నమోదై దర్యాప్తు జరుగుతోందని తెలిపారు. ‘అన్వేశ్ ఎక్కడ నుంచి ప్రారంభమయ్యారో... మళ్లీ అక్కడికే రావాలన్నది’ నా లక్ష్యం అని ఆమె వ్యాఖ్యానించారు. ఇటీవల అన్వేశ్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా తాత్కాలికంగా నిలిచిపోవడంపై కూడా కల్యాణి స్పందించారు. యూట్యూబ్ ఛానల్ పోతే తన జీవనాధారం దెబ్బతింటుందనే భయం అన్వేశ్‌ను పట్టుకుందని ఆమె ఎద్దేవా చేశారు. అన్వేశ్‌లో ‘మేకపోతు గాంభీర్యం’ కనిపిస్తోందని విమర్శించారు. విదేశాల్లో ఉంటూ దేశ ప్రతిష్ఠను దెబ్బతీసేలా మాట్లాడటాన్ని సహించబోమని ఆమె తేల్చిచెప్పారు.

# ఏపీ లిక్కర్ కేసులో కీలక మలుపు.. వాసుదేవరెడ్డి అరెస్ట్

**ఏపీబీసీఎల్ మాజీ ఎండి వాసుదేవరెడ్డిని అరెస్ట్ చేసిన సీఐడీ**
**ఫైళ్లు, కంప్యూటర్ పరికరాలు, కీలక పత్రాలు చోరీ చేశారంటూ కేసు నమోదు**
**ఇప్పటి వరకు అజ్ఞాతంలో ఉన్న వాసుదేవరెడ్డి**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

ఏపీ లిక్కర్ స్కామ్ దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. తాజాగా మరో అరెస్ట్ జరిగింది. ఆంధ్రప్రదేశ్ బెవరేజెస్ కార్పొరేషన్ (ఏపీబీసీఎల్) మాజీ ఎండీ, ఐఆర్టీఎస్ అధికారి వాసుదేవరెడ్డిని సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు. వైసీపీ హయాంలో జరిగిన మద్యం స్కాంకు సంబంధించి విజయవాడలోని ఏపీబీసీఎల్ కార్యాలయం నుంచి ఫైళ్లు, కంప్యూటర్ పరికరాలు, కీలక పత్రాలను చోరీ చేశారంటూ ఆయనపై ఫిర్యాదు అందింది. ఈ క్రమంలో ఆయనపై ఆధారాల ధ్వంసం, చోరీ, నేరపూరిత కుట్ర అభియోగాలతో 2024 జూన్‌లో కేసు నమోదు అయింది. ఈ కేసులో ఆయన ఏ2గా ఉన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో సీఐడీ సోదాలకు వెళ్లిన సమయంలో వాసుదేవరెడ్డి పరారయ్యారు. అప్పటి నుంచి అజ్ఞాతంలో ఉండగా... తాజాగా సీఐడీ పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు.

# తిరుమలలో పోటెత్తిన భక్తులు

**సర్వదర్శనానికి 20 గంటలు**
**తిరుమలలో భారీగా పెరిగిన భక్తుల రద్దీ**
**వైకుంఠం కాంప్లెక్స్ దాటి శిలాతోరణం వరకు క్యూలైన్లు**
**శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న 68,156 మంది భక్తులు**
**వేసవి రద్దీకి ముందస్తు ఏర్పాట్లపై టీటీడీ సమీక్ష**



**తిరుమల, జై భీమ్ న్యూస్**

తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. కొండపై భక్తుల రద్దీ అనూహ్యంగా పెరగడంతో సర్వదర్శనానికి ఏకంగా 18 నుంచి 20 గంటల సమయం పడుతోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లు పూర్తిగా నిండిపోయి, క్యూలైన్లు బయట శిలాతోరణం వరకు విస్తరించాయి. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శనివారం ఉదయం వెల్లడించిన వివరాల ప్రకారం, శుక్రవారం ఒక్కరోజే 68,156 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరిలో 28,295 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.46 కోట్లుగా నమోదైంది. గురువారంతో పోలిస్తే దర్శన సమయం 10-12 గంటల నుంచి ఒక్కసారిగా 20 గంటలకు చేరడం రద్దీ తీవ్రతకు అద్దం పడుతోంది. మరోవైపు, రానున్న వేసవి సెలవుల రద్దీని దృష్టిలో ఉంచుకుని టీటీడీ అధికారులు ముందస్తు ఏర్పాట్లపై దృష్టి సారించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, దర్శన సమయాన్ని తగ్గించే లక్ష్యంతో టీటీడీ అదనపు ఈవో ఆధ్వర్యంలో నిన్న ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. డేటా ఆధారిత వ్యూహంతో రద్దీని సమర్థవంతంగా నియంత్రించేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# గద్వాల జిల్లాలో డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఫ్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదం

**అయిజ పట్టణంలో రాయచూర్ వెళ్లే మార్గంలో ప్రమాదం**
**షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం**
**మంటలను అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది**

**గద్వాల, జై భీమ్ న్యూస్**

తెలంగాణలోని గద్వాల జిల్లాలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. అయిజ పట్టణంలోని రాయచూర్ వెళ్లే మార్గంలో ఉన్న డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఫ్యాక్టరీలో విద్యుదాఘాతంతో అగ్ని ప్రమాదం సంభవించింది. ఫ్యాక్టరీలో భారీగా మంటలు ఎగిసిపడటంతో సిబ్బంది పరుగులు తీశారు. మంటలు వేగంగా వ్యాప్తి చెందడంతో సమీపంలోని స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చింది. షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఫ్యాక్టరీలో నిల్వ ఉంచిన ప్లాస్టిక్ డ్రిప్ పైపులు, ముడిసరుకు, యంత్రాలు మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమయ్యాయి.

# అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

**ఫిబ్రవరి 21 జై భీమ్ న్యూస్**

ఐక్యరాజ్యసమితి ప్రధాన విభాగం యునెస్కో 1999 లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ప్రకటించింది. నాటి పాకిస్థాన్ లో బెంగాలీలు 1952లో తమ మాతృభాష బెంగాలీ పరిరక్షణ కోసం చేసిన పోరాటానికి గుర్తుగా బంగ్లాదేశ్ ప్రతిపాదన మేరకు ఈ తేదీ ఖరారైంది. యునెస్కో విద్యాబోధనలో కనీసం మూడు భాషలు.. మాతృభాష, జాతీయ భాష, అంతర్జాతీయ భాష.. లకు చోటుండాలని 1999 నుంచి ప్రచారం చేయడం ఆరంభించింది. పిల్లలు పసిప్రాయంలో మాతృభాష తరువాత మిగిలిన రెండు భాషలు నేర్చుకుంటే వారి జీవితం సాఫీగా సాగిపోతుందని పై ప్రతిపాదన చేసింది. చిన్న పిల్లల మానసిక ఆరోగ్యానికి వారి మాతృభాషతో సంబంధం ఉందని పరిశోధకులు తేల్చారు. పుట్టిన దగ్గర్నుంచి మాతృభాష ధ్వనులు వింటుండటం వల్ల వారిపై ప్రభావం చూపుతాయి. మాతృభాషలో మాట్లాడలేని పిల్లల్లో చురుకుదనం తక్కువగా ఉంటుందని మానసిక నిపుణులు చెబుతున్నారు. అమ్మపాలు, అమ్మభాష లకు ఏవీ సాటిరావు. ఎదుగుదలకు అభివృద్ధికి మాతృభాష ఎంతగానో తోడ్పడుతుంది. గ్లోబలైజేషన్ నేపథ్యంలో కొన్ని భాషలకే అధిక ప్రాధాన్యం లభిస్తుతటం వలన రాబోయే కాలంలో వందలాది భాషల ఉనికి అంతరించిపోయే ప్రమాదం కనబడుతోంది. గనుక మనందరం మన మాతృభాష ఉనికిని మనం కాపాడుకోవాలి. మన భాషా సంస్కృతి వారసత్వాన్ని నిలబెట్టుకునేందుకు మనలో ప్రతీ ఒక్కరూ కృషి చేయాలి. మన మాతృభాషను మరచిపోతే మన కన్నతల్లిని మరచినట్లే. ఈరోజుల్లో ఉద్యోగ వ్యాపారాల నిమిత్తం ఇతర రాష్ట్రాలలో, విదేశాల్లో స్థిరపడిపోతున్నారు. పిల్లలు తమ మాతృభాషకు దూరమవుతున్నారు. మనమే మన పిల్లలకు చిన్నతనం నుంచే మన మాతృభాష మాధుర్యం మమకారం వారికి చెబుతుండాలి.. రాయడం చదవడం నేర్పించాలి. ఆధునిక నాగరికత మోజులో పడిపోయి మన మాతృభాషను నిర్లక్ష్యం చేయడం తగదు. యునెస్కో కూడా ఇదే సూచిస్తోంది. మన మాతృభాషను కాపాడుకోవలసిన బాధ్యత మనదే. అందరికీ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం శుభాకాంక్షలు..



# సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ





**వరంగల్, 21 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

పీడిత వర్గాల సమానత్వం కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడు సంత్ సేవాలాల్ మహారాజ్ అని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. వరంగల్ నగరంలోని 19వ డివిజన్ కాశీబుగ్గలో నిర్వహించిన సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంత్ సేవాలాల్ చిత్రపటానికి పూజలు నిర్వహించిన మంత్రి, బంజారా మహిళలతో కలిసి సంప్రదాయ నృత్యాల్లో పాల్గొని డోలు వాయిస్తూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన అధికారిక సభలో మాట్లాడుతూ, సంత్ సేవాలాల్ బంజారాల ఆరాధ్య గురువే కాకుండా సమాజంలో చైతన్యం నింపిన మహనీయుడని అన్నారు. మూఢనమ్మకాలు, జంతు బలులను తీవ్రంగా వ్యతిరేకించిన ఆయన జీవహింస మహాపాపమని బోధించారని, మద్యపానం, ధూమపానం వంటి చెడు అలవాట్లను విడనాడాలని సూచించారని గుర్తుచేశారు. మహిళలకు సమాన గౌరవం ఇవ్వాలని, సమాజంలో సమానత్వాన్ని నెలకొల్పాలని శతాబ్దాల క్రితమే ఉపదేశించిన దార్శనికుడు సేవాలాల్ అని మంత్రి పేర్కొన్నారు. ఆయుర్వేదం, ప్రకృతి వైద్యం ద్వారా అనేక మందికి ఉపశమనం కలిగించారని తెలిపారు. బంజారాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని మంత్రి పేర్కొంటూ, నగరంలో సంత్ సేవాలాల్ ఆలయం నిర్మాణంతో పాటు కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్, మేయర్‌లతో చర్చించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో సంత్ సేవాలాల్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. గతంలో ఖమ్మం రోడ్డు ప్రాంతంలో దొంగిలించబడిన విగ్రహ ఘటనపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశించినట్లు తెలిపారు. బంజారా, గిరిజనులకు రెండు పడక గదుల ఇళ్ల విషయమై ప్రతినిధులు రాతపూర్వక వినతి పత్రం అందజేస్తే పరిశీలిస్తామని పేర్కొన్నారు. వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ, సంత్ సేవాలాల్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయం అని అన్నారు. ఆయన సేవలు అన్ని వర్గాల ప్రజలకు ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, బంజారా నాయకులు, స్థానికులు పాల్గొన్నారు. వేడుకలు భక్తి, ఉత్సాహ వాతావరణంలో ఘనంగా జరిగాయి.

# మైనార్టీలకు ఆర్థిక సహాయం పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

**వరంగల్, 21 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ వర్గాల ఆర్థిక అభ్యున్నతికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి తెలిపారు. తెలంగాణ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ (టీజీ ఎం.ఎఫ్.సి) ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ఎకనామిక్ సపోర్ట్ స్కీమ్ కింద 2025--26 ఆర్థిక సంవత్సరానికి అర్హులైన మైనార్టీ అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. ఈ పథకంలో రెండు విభాగాలు ఉన్నాయి. టూల్‌కిట్లు, జనరల్ ట్రేడ్ - గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన అర్హులైన అభ్యర్థులకు స్వయం ఉపాధి కోసం రూ.60,000 వరకు ఆర్థిక సహాయం అందించనున్నారు. ఇందులో రూ.10,000 టూల్‌కిట్ రూపంలో, రూ.50,000 జనరల్ సపోర్ట్‌గా 100 శాతం సబ్సిడీపై మంజూరు చేస్తారు. ఈ-స్కూటర్ పథకం (పైలట్ ప్రాజెక్ట్): మైనార్టీ యువతకు ఉపాధి అవకాశాల కల్పన లక్ష్యంగా ఈ పథకం అమలు చేస్తున్నారు. ఒక్కో యూనిట్ వ్యయం రూ.1.50 లక్షలు కాగా, అందులో 80 శాతం (రూ.1.20 లక్షలు) సబ్సిడీగా, మిగిలిన 20 శాతం (రూ.30,000) లబ్ధిదారుడు భరించాలి. ఎంపికైన అభ్యర్థులు ఉబర్, ఓలా, రాపిడో వంటి సేవా సంస్థలతో అనుసంధానం చేసుకుని ఉపాధి పొందే అవకాశం ఉంటుంది. అర్హతలు - టూల్‌కిట్లు ఌ జనరల్ ట్రేడ్ పథకానికి 21 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలి. ఈ-స్కూటర్ పథకానికి 21 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలి. కుటుంబ ఆదాయం ప్రభుత్వం నిర్దేశించిన పరిమితిలో ఉండాలి. గత ఐదు సంవత్సరాలలో టీజీ ఎం.ఎఫ్.సి ద్వారా లబ్ధి పొందకపోవాలి. ఈ-స్కూటర్ పథకానికి చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ (జీరో కేసులు), పాన్ కార్డు తప్పనిసరి. ఆన్‌లైన్ దరఖాస్తులు ఫిబ్రవరి 20, 2026 ఉదయం 10:30 గంటల నుండి మార్చి 1, 2026 రాత్రి 11:59 గంటల వరకు టీజీ ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో స్వీకరించబడతాయని అధికారులు తెలిపారు. అర్హులైన మైనార్టీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# పింగిళి డిగ్రీ కళాశాలలో ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహణ

**హన్మకొండ, 21 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ పీజీ కళాశాల (స్వయం ప్రతిపత్తి), హనుమకొండలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభాష అయిన మన తెలుగు భాష మధురమైన భాష అని పేర్కొన్నారు. పాశ్చాత్యులు తెలుగును "ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్"గా ప్రశంసించారని గుర్తుచేశారు. విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి సాధించాలంటే మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వాలని, తెలుగు భాషను రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ రచయిత్రి డా. దేవులపల్లి వాణీదేవి తెలుగు భాష ప్రాముఖ్యతను వివరించారు. కవితా రచన, కథా రచనలోని మెళకువలను వివరించి, తాను రచించిన అనేక కవితలు, కథలను విద్యార్థులతో పంచుకున్నారు. సృజనాత్మక రచన ద్వారా భావ వ్యక్తీకరణకు విస్తృత అవకాశాలు లభిస్తాయని తెలిపారు. తెలుగు విభాగాధిపతి ఎస్. మధు మాట్లాడుతూ మాతృభాషా దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. తెలుగు భాషలో కవిత, కథలతో పాటు ఇతర సాహిత్య ప్రక్రియల్లో రచనలు చేయడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని అన్నారు. తెలుగు విభాగ అధ్యాపకులు డా. లక్ష్మీకాంతం, రత్నమాల మాతృభాషా దినోత్సవ విశిష్టతను, తెలుగు భాష ప్రత్యేకతను వివరిస్తూ ఉపన్యసించారు. ఈ సందర్భంగా తెలుగు విభాగం నిర్వహించిన "సృజనాత్మక రచన -- కథ" సర్టిఫికెట్ కోర్సు ముగింపు కార్యక్రమాన్ని కూడా నిర్వహించి, కోర్సులో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. మాతృభాషా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ముఖ్య అతిథి డా. దేవులపల్లి వాణీదేవిని శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కె. రాజేశ్వరి, డా. వి. మమత, బోధన--బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# టీచర్స్ కాలనీలో వెంకటేశ్వర స్వామి ఆలయ ఆర్చ్ నిర్మాణానికి శంకుస్థాపన



**హన్మకొండ, 21 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

హన్మకొండ టీచర్స్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ఆర్చ్ నిర్మాణానికి శనివారం శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కడియం శ్రీహరి, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఆయనతో పాటు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, ఆర్చ్ నిర్మాణ పనులను అధికారికంగా ప్రారంభించారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా చేపడుతున్న ఈ ఆర్చ్ నిర్మాణం కాలనీకి మరింత ఆకర్షణీయంగా మారుతుందని నాయకులు పేర్కొన్నారు. స్థానిక కార్పొరేటర్, కాలనీ కమిటీ ప్రతినిధులు, భక్తులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని సందర్శించిన ఆర్‌టీఐ కమీషనర్ శ్రీనివాసరావు



**వరంగల్, 21 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంను తెలంగాణ రాష్ట్ర ఆర్‌టీఐ కమీషనర్ శ్రీనివాసరావు ఈ రోజు ఉదయం కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థాన అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. ముందుగా ఆదిశంకరాచార్యుల విగ్రహాన్ని, వల్లభ గణపతిని దర్శించిన అనంతరం అమ్మవారి సన్నిధిలోకి ప్రవేశించి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. వేద మంత్రోచ్చారణల మధ్య భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు కొనసాగాయి. పూజానంతరం ఆలయ స్నపన మండపంలో అర్చకులు, వేదపండితులు మహదాశీర్వచనం నిర్వహించి, అమ్మవారి శేషవస్త్రాలను బహూకరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌టీఐ కమీషనర్ ఆలయ అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో స్వల్పంగా చర్చించినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి, సహాయ కమీషనర్ రామల సునీత తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు భాషా పోటీల్లో శ్రీ చైతన్య విద్యార్థుల జోరు

**విజేతలకు ఎమ్మెల్యే నాయిని అభినందనలు**

**"అమ్మ భాషను మరువద్దు" పిలుపు**



**హన్మకొండ, 21 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ: మాతృభాష తీపిని ఆస్వాదించాలని, తెలుగు ఇతిహాసాలను చదివి సంస్కృతిని పరిరక్షించాలని విద్యార్థులకు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సూచించారు. నక్కలగుట్టలోని శ్రీ చైతన్య పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎన్ని భాషలు నేర్చుకున్నా కన్నతల్లి లాంటి మాతృభాషను ఎప్పటికీ విస్మరించకూడదన్నారు. మాతృభాష మన వ్యక్తిత్వానికి పునాది వంటిదని, తెలుగు సాహిత్యం, చరిత్ర, సంస్కృతి గురించి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రపంచీకరణ యుగంలో ఇతర భాషల ప్రాముఖ్యత ఉన్నప్పటికీ, తమ భాష పట్ల గౌరవం కలిగి ఉండటం ప్రతి విద్యార్థి బాధ్యత అని చెప్పారు. పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు మెడల్స్ ప్రదానం చేసి అభినందనలు తెలిపారు. విద్యార్థుల ప్రతిభను మెచ్చుకుని, భవిష్యత్తులో కూడా ఇటువంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ మల్లంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, డీజీఎం చేతన్, ఆర్ఐ మనోహర్, జోనల్ కోఆర్డినేటర్ జి. శివ కోటేశ్వరరావు, స్కూల్ ప్రిన్సిపాల్ సీమ, డీన్ సుప్రియ, ప్రైమరీ ఇన్‌చార్జి అనిత, తెలుగు ఉపాధ్యాయులు శ్రీనివాసాచారి, రక్షిత, శ్రీమతి తదితరులు పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల ఫీజుల పెంపు ప్రతిపాదనపై ఏబీవీపీ ఆగ్రహం

**హన్మకొండ, 21 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఫీజుల పెంపును ప్రతిపాదిస్తూ తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులటరీ కమిటీ (టి.ఎ.ఎఫ్.ఆర్.సి) ప్రభుత్వం వద్దకు నివేదిక సమర్పించడాన్ని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) తెలంగాణ రాష్ట్ర శాఖ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ విషయమై కాకతీయ యూనివర్సిటీ గెస్ట్ హౌస్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు మాట్లాడారు. ఫీజుల పెంపు వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు ఇంజనీరింగ్ విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 19 ఇంజనీరింగ్ కళాశాలల్లో ఫీజులు తగ్గించిన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నప్పటికీ, 63 కళాశాలల్లో భారీగా ఫీజులు పెంచడానికి తీసుకున్న ప్రమాణాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొంతమంది సర్టిఫికెట్లు కూడా పొందలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.




ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో ప్రైవేట్ కళాశాలల ఫీజులపై విమర్శలు చేస్తూ విజిలెన్స్ విచారణకు ఆదేశించిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఇప్పుడు ఫీజుల పెంపు ప్రతిపాదనలు రావడం అనుమానాస్పదమని పేర్కొన్నారు. కళాశాలల ఆడిట్ రిపోర్టులను బహిర్గతం చేసి పారదర్శకతను పాటించాలని డిమాండ్ చేశారు. టీచింగ్, నాన్-టీచింగ్ సిబ్బందికి జీతాలు పెంచకుండా, మౌలిక సదుపాయాలు మెరుగుపరచకుండా ఫీజులు పెంచడం సమంజసం కాదని విమర్శించారు. ఈ నిర్ణయం వెనుక ఆర్థిక లావాదేవీలు జరిగి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అన్ని కళాశాలల్లో ఫీజులు తగ్గించాలని, తప్పుడు ఆడిట్ రిపోర్టులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు బకాయి ఉన్న రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను తక్షణమే విడుదల చేయాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించింది. ఈ సమావేశంలో ఏబీవీపీ కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షుడు ఉబ్బటి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ యూనివర్సిటీలో 8వ రాష్ట్ర తెలంగాణ హెరిటేజ్ కాంగ్రెస్ నిర్వహణకు సన్నాహాలు



**హన్మకొండ, 21 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీలో ఈసారి 8వ రాష్ట్ర తెలంగాణ హెరిటేజ్ కాంగ్రెస్‌ను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని యూనివర్సిటీ అధికారులు వెల్లడించారు. దాదాపు రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సులో తెలంగాణ సంస్కృతి, చరిత్ర, వారసత్వ అంశాలపై పలు ముఖ్య చర్చలు, సదస్సులు, ప్రదర్శనలు నిర్వహించనున్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో తెలంగాణ హెరిటేజ్ కాంగ్రెస్ కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. ఈ క్రమంలో కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆర్య డి. రామచంద్రం ముఖ్య అతిథిగా పాల్గొని, సదస్సు నిర్వహణకు కావాల్సిన చర్యలు చేపట్టాలని సూచించారు. తెలంగాణ చరిత్రను వెలుగులోకి తెచ్చేలా చర్చలు, పురావస్తు శాస్త్రవేత్తలు, రచయితలు, పరిశోధకులు పాల్గొనే విధంగా కార్యక్రమాలను రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ హెరిటేజ్ కాంగ్రెస్ 1956 నుంచి రాష్ట్ర చరిత్ర, వైభవం, సామాజిక సంప్రదాయాలు, సాంస్కృతిక పునరుద్ధరణ వంటి అంశాలపై విశేష కృషి చేస్తూ వస్తోంది. గతంలో మెదక్‌లో నిర్వహించిన సదస్సుల్లో కూడా విశేష స్పందన లభించిందని నిర్వాహకులు పేర్కొన్నారు. 2007 సంవత్సరంలో నిర్వహించిన కార్యక్రమాలకు కూడా మంచి ఆదరణ లభించిందని తెలిపారు. ఈసారి నిర్వహించనున్న 8వ రాష్ట్ర సదస్సుకు దాదాపు 400 మంది పండితులు, పరిశోధకులు, విద్యార్థులు హాజరుకానున్నారు. యూనివర్సిటీ పరిధిలోని పలు విభాగాలు కలిసి సమన్వయంతో ఏర్పాట్లు చేపడుతున్నాయి. కాంగ్రెస్ నిర్వహణ కమిటీలో అధ్యక్షుడు డా. యాదగిరి, కార్యదర్శి ఆర్య పాండురంగులు, యూనివర్సిటీ అధికారులు డా. విజయకుమార్, డా. యాదగిరి రావు, డా. రామకృష్ణ బాబు, డా. లక్ష్మణ్, డా. మల్లారెడ్డి తదితరులు సభ్యులుగా ఉన్నారు. ఈ సదస్సు ద్వారా తెలంగాణ చరిత్ర, సంస్కృతి, వారసత్వ పరిరక్షణకు కొత్త దిశా నిర్దేశం లభిస్తుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## శ్రీశైలం మలన్న హుండీ లెక్కింపు.. 13 రోజుల్లో కోట్లల్లో భక్తుల కానుకలు!



**నంద్యాల : జై భీమ్ న్యూస్**

నంద్యాల జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి చెంత భక్తులు తమ భక్తిని చాటుకున్నారు. ఇటీవల అత్యంత వైభవంగా జరిగిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు పోటెత్తారు. ఈసందర్భంగా స్వామి,అమ్మవార్లకు సమర్పించిన కానుకల లెక్కింపును దేవస్థానం అధికారులు పూర్తి చేశారు. గత 13 రోజులకు గాను మల్లన్నకు భారీగా ఆదాయం లభించింది. చంద్రవతి కళ్యాణ మండపంలో కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల నిఘా మధ్య జరిగిన ఈ లెక్కింపులో స్వామివారికి రూ. 5,61,81,535 ల నగదు ఆదాయం వచ్చినట్లు దేవస్థానం చైర్మన్ రమేష్ నాయుడు, ఈవో శ్రీనివాసరావు అధికారికంగా ప్రకటించారు. నగదుతో పాటు భక్తులు మొక్కుల రూపంలో పెద్ద ఎత్తున బంగారు, వెండి ఆభరణాలను సమర్పించారు. స్వామి అమ్మవార్లకు కానుకగా 124.5 గ్రాముల బంగారం, 5.550 కేజీల వెండి సమకూరాయి. భారతీయ కరెన్సీతో పాటు విదేశాల్లోని భక్తులు కూడా స్వామివారిపై తమ భక్తిని చాటుకున్నారు. హుండీలో 22 అమెరికా డాలర్లు , 25 ఇంగ్లాండ్ పౌండ్లు, 15 ఆస్ట్రేలియా డాలర్లు, సింగపూర్ డాలర్లు, యూర.

## కమలాపూర్‌లో అర్ధరాత్రి దొంగతనాలు


### అప్రమత్తంగా ఉండాలని పోలీసుల హెచ్చరిక

**వరంగల్, 21 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్):**

కమలాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఇటీవల అర్ధరాత్రి సమయంలో దొంగతనాలు, ముఖ్యంగా వ్యవసాయ పొలాల్లో కరెంట్ మోటార్ల దొంగతనాలు పెరుగుతున్న నేపథ్యంలో గ్రామ ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని కమలాపూర్ పోలీసులు సూచించారు. గత కొన్ని రోజులుగా రాత్రి వేళల్లో గుర్తు తెలియని వ్యక్తులు గ్రామ పరిసరాల్లో సంచరిస్తున్నట్లు సమాచారం అందినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇళ్ల వద్ద, వ్యవసాయ పొలాల్లో ఉన్న మోటార్లు మరియు ఇతర సామగ్రిపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. అదేవిధంగా, గ్రామంలో ఎవరైనా అపరిచిత వ్యక్తులు తిరుగుతున్నట్లు గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సందేహాస్పద వ్యక్తుల సమాచారం కోసం కమలాపూర్ పోలీస్ స్టేషన్ ఫోన్ నంబర్లు - 8712685014, 8712685249. గ్రామ ప్రజల సహకారంతోనే నేరాలను అరికట్టగలమని ఇన్స్పెక్టర్ నవీన్ తెలిపారు. గ్రామ భద్రత అందరి బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## తిరుమల లడ్డు కంట్రోవర్సీ

**(ఆంధ్రప్రదేశ్ జై భీమ్ న్యూస్)**




తిరుమల లడ్డా నెయ్యి కల్తీ (తిరుమల లడ్డు కంట్రోవర్సీ) వివాదానికి సంబంధించినది. 2024 సెప్టెంబర్‌లో చంద్రబాబు నాయుడు, గత ప్రభుత్వ హయాంలో లడ్డా తయారీలో ఉపయోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని ఆరోపించడంతో ఈ కేసును విచారించిన ప్రత్యేక విచారణ బృందం (సిట్ ) ఇటీవలే (జనవరి-ఫిబ్రవరి 2026 నాటికి) కోర్టుకు తన అభిప్రాయాలను సమర్పించింది. నివేదిక ప్రకారం: కల్తీ నిజమే, కానీ: నెయ్యి కల్తీ జరిగిందని సిట్ ధృవీకరించింది. అయితే, అది చంద్రబాబు నాయుడు మొదట ఆరోపించినట్లుగా( "జంతువుల కొవ్వు")కాదని, (పామాయిల్), ఇతర వెజిటబుల్ ఆయిల్స్ మరియు కెమికల్స్ అని తేలింది. ముఠా గుట్టురట్టు: తక్కువ ధరకే నెయ్యి సరఫరా చేస్తామని టెండర్లు దక్కించుకుని, నాసిరకం నెయ్యిని సరఫరా చేసిన ముఠాలను సిట్ గుర్తించింది. ఏ ర్ డైరీ మరియు బోలే బాబా డైరీ వంటి సంస్థలపై అభియోగాలు నమోదయ్యాయి. అరెస్టులు : ఈ కుంభకోణంలో ప్రమేయం ఉన్న కొంతమంది డైరీ నిర్వాహకులను మరియు టీటీడీ లోని అప్పటి అధికారులను సిట్ అరెస్ట్ చేసింది. రాష్ట్రము అభివృద్ధి పక్కన పెట్టి . ప్రస్తుత రాజకీయ స్థితి. వైస్సార్సీపీ వాదన: జంతువుల కొవ్వు లేదని సిట్ చెప్పడంతో, చంద్రబాబు రాజకీయ లబ్ధి కోసం తప్పుడు ఆరోపణలు చేశారని, భక్తుల మనోభావాలను దెబ్బతీశారని వైస్సార్సీపీ విమర్శిస్తోంది.టీడీపీ వాదన : కల్తీ జరిగిందనేది వాస్తవం అని, అది పామాయిల్ అయినా, మరొకటి అయినా భక్తుల పవిత్రతను దెబ్బతీసినట్లేనని, గత ప్రభుత్వ అవినీతి వల్లే ఇది జరిగిందని టీడీపీ ప్రభుత్వం వాదిస్తోంది. చంద్రబాబు "దొరికిపోయారు" అనడం కంటే, ఆరోపణల్లో పేర్కొన్న పదార్థం (జంతువుల కొవ్వు) విషయంలో స్పష్టత లేకపోవడం వల్ల ఆయన ఇప్పుడు రాజకీయంగా విమర్శలు ఎదుర్కొంటున్నారు. కానీ, కల్తీ జరిగిందన్న విషయంలో మాత్రం సిట్ ఆధారాలను కనుగొంది.

## మేడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ చేసిన కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్, 21 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

జిల్లాలో ప్రజలకు సమయపాలనతో, నాణ్యమైన వైద్యసేవలు అందించడంలో ఎటువంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద స్పష్టం చేశారు. శనివారం నల్లబెల్లి మండలం మేడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా విధుల్లో ఉన్న వైద్యులు, సిబ్బంది హాజరు వివరాలపై ఆరా తీసి హాజరు రిజిస్టర్ సహా పలు రికార్డులను పరిశీలించారు. కొంతమంది వైద్యులు, సిబ్బంది గైర్హాజరు కావడం, హాజరు రికార్డులను సక్రమంగా నిర్వహించకపోవడం పట్ల కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నెల రోజుల్లో గడువు ముగియనున్న మందులు, టీకాలను ఫ్రిడ్జ్‌లో నిల్వ ఉంచడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఔషధ నిల్వలను క్రమబద్ధంగా నిర్వహించాలని ఆదేశించారు. రోగులకు వినియోగానికి అనుకూలం కాని మందులు ఇవ్వడం గమనించిన కలెక్టర్, ఇటువంటి నిర్లక్ష్యం పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టాఫ్ నర్సుల కొరతపై వివరాలు తెలుసుకున్న కలెక్టర్, పీహెచ్‌సీ డాక్టర్ గైర్హాజరు కావడంతో స్టాఫ్ నర్స్ కేంద్రాన్ని నిర్వహించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. తనిఖీ సమయంలో ఎంఎల్‌హెచ్‌పీ, ఆయుర్వేద వైద్యుడు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు అందుబాటులో లేకపోవడంపై కూడా వివరణ కోరారు. పీహెచ్‌సీ డాక్టర్ యాంటీ వీనం మందు తీసుకురావడానికి వెళ్లినట్లు తెలిపినప్పటికీ, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో నిర్వహించిన విచారణలో ఆ మందు తీసుకురాలేదని తేలింది. ల్యాబ్ టెక్నీషియన్ రక్తపరీక్షలు నిర్వహించడం లేదని కూడా కలెక్టర్ గుర్తించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులతో మాట్లాడిన కలెక్టర్, వైద్యులు--సిబ్బంది గైర్హాజరు కావడం, సరైన వైద్యం అందకపోవడం పై వారు వ్యక్తం చేసిన అసంతృప్తిని నమోదు చేసుకున్నారు. పీహెచ్‌సీ డాక్టర్ విధులకు గైర్హాజరు కావడంపై తక్షణ క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోను ఆదేశించిన కలెక్టర్, ప్రభుత్వ వైద్యసేవలపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే చర్యలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని హెచ్చరించారు. బాధ్యతారాహిత్యంపై కఠిన చర్యలు తప్పవని ఆమె స్పష్టం చేశారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ సి.హెచ్. మహేందర్





**ములుగు, 21 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో ములుగు జిల్లాలోని కన్నాయిగూడెం మండలం దేవాదుల ప్రాజెక్ట్ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సి.హెచ్. మహేందర్ జి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జ్ ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ కూడా ఆయనతో కలిసి ఏర్పాట్లను సమీక్షించారు. ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి దేవాదుల ప్రాజెక్ట్ పరిశీలన పర్యటనకు రానున్న నేపథ్యంలో ప్రాజెక్ట్ ఆవరణలో ఏర్పాటు చేస్తున్న అధికారుల సమావేశ ప్రాంతం, హెలిప్యాడ్, గోదావరి నది వ్యూ పాయింట్ తదితర ప్రాంతాలను అదనపు కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్, అతిథుల స్వాగతం, ప్రోటోకాల్ నిర్వహణ వంటి అంశాలపై కూడా సమగ్రంగా సమీక్ష నిర్వహించి, ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు, ఇరిగేషన్ ఈఈ శంకరయ్య, నారాయణ, ఆర్డీఓ వెంకటేష్, డీపీఓ వెంకయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

## నా కుమారుడి వ్యాఖ్యలను వక్రీకరించారు: జేసీ ప్రభాకర్ రెడ్డి

### ఏపీ ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని అస్మిత్ రెడ్డి అన్నారన్న జేసీ ఈ వ్యాఖ్యలను కొందరు జర్నలిస్టులు వక్రీకరించారని మండిపాటు చంద్రబాబు నేర్పించిన విజన్ తో తాము బతుకుతున్నామని వ్యాఖ్య

**అనంతపురం, జై భీమ్ న్యూస్**



తన కుమారుడు అస్మిత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కొంతమంది జర్నలిస్టులు వక్రీకరిస్తున్నారని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవని అస్మిత్ రెడ్డి అన్న మాటలను కొందరు జర్నలిస్టులు వక్రీకరించారని మండిపడ్డారు. జగన్ హయాంలో తెచ్చిన అప్పులకు తమ ప్రభుత్వం వడ్డీ కడుతోందని చెప్పారు. తాడిపత్రిలో జరుగుతున్న అభివృద్ధి గురించి జగన్‌కు తెలియదని... ఆయనకు చెప్పాల్సిన అవసరం కూడా లేదని అన్నారు. అనంతపురంలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు నేర్పించిన విజన్‌తో తాము బతుకుతున్నామని... ఆయన రాత్రి పగలు లేకుండా రాష్ట్ర అభివృద్ధికి శ్రమిస్తున్నారని కితాబునిచ్చారు. మంత్రి నారా లోకేశ్ సహా కూటమి నేతలు అహర్నిశలు కష్టపడుతున్నారని తెలిపారు. వైసీపీ హయాంలో పోలవరంతో సహా అన్ని ప్రాజెక్టులను నిర్లక్ష్యంగా వదిలేశారని విమర్శించారు. ఏప్రిల్ నాటికి తాడిపత్రికి సోలార్ విద్యుత్ వస్తుందని చెప్పారు. కడప, కర్నూల్‌లో లేని విధంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తాడిపత్రిలో ఉందని తెలిపారు. చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసినట్లే తాము తాడిపత్రి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.

# నేను పార్టీ అధ్యక్షుడిని అయ్యే నాటికి పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉంది: రేవంత్ రెడ్డి

**పార్టీలో కొందరి నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నానని తెలిపిన రేవంత్ రెడ్డి**
**నేతలందరినీ కలిసి తన ఆలోచన చెప్పి వారిని ఒప్పించానన్న ముఖ్యమంత్రి**
**అందరి కృషి వల్ల తెలంగాణలో పార్టీ తిరిగి పుంజుకున్నదన్న ముఖ్యమంత్రి**



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తాను టీపీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టే నాటికి పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రేవంత్ రెడ్డి అన్నారు. పార్టీలో కూడా కొందరి నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నానని, నేతలందరినీ కలిసి తన ఆలోచన చెప్పి వారిని ఒప్పించానని గుర్తుచేసుకున్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలో నిర్వహించిన ఏపీ, తెలంగాణ డీసీసీ అధ్యక్షుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీలో తొలి నుంచి భిన్నాభిప్రాయాలు వెలువరించే స్వేచ్ఛ ఉందని అన్నారు. భిన్నాభిప్రాయాలు చెప్పినంత మాత్రాన వారిని వేధించే సంస్కృతి కాంగ్రెస్ పార్టీలో లేదని వెల్లడించారు. మనలో మనం కొట్టుకుంటే పార్టీలో కష్టపడి పనిచేసే లక్షలాది మంది కార్యకర్తలకు అన్యాయం చేసినట్లు అవుతుందని అన్నారు. అందరి కృషి వల్లే తెలంగాణలో పార్టీ తిరిగి పుంజుకున్నదని అన్నారు. డీసీసీ అధ్యక్షులుగా బాగా పనిచేసిన వారికి ఎమ్మెల్యే టిక్కెట్లు ఇచ్చామని, ఎమ్మెల్యే టిక్కెట్లు రాని వారికి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చామని తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన మరో అరవై మందికి కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇచ్చామని ముఖ్యమంత్రి వెల్లడించారు. పార్టీలో అందరి పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని హెచ్చరించారు. పార్టీ కోసం శ్రమించే వారికి కచ్చితంగా న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. మెరిట్ ప్రకారమే పార్టీలో అవకాశాలు వస్తాయన్నారు. డీసీసీ పదవి ఎంతో విలువైనదని, దీనిని ఏమాత్రం దుర్వినియోగం చేసుకోవద్దని హితవు పలికారు. మంచి ప్రతిభ కనబరిస్తే ఆ తర్వాత ఎమ్మెల్యే, మంత్రి, ముఖ్యమంత్రి కూడా కావొచ్చని అన్నారు. నాయకులు ఎప్పుడూ ప్రజల్లో ఉండాలని సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర చేసి ప్రజల మధ్య రోజుల తరబడి ఉన్నారని అన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేశారని గుర్తుచేశారు. మోతీలాల్ నెహ్రూ దేశం కోసం వేల కోట్ల రూపాయలను ఆ రోజుల్లోనే త్యాగం చేశారని, జవహర్ లాల్ నెహ్రూ జైల్లో ఉన్నారని తెలిపారు. ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణాలు అర్పించారని తెలిపారు.

# కామారెడ్డిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఉద్రిక్తత

**ముట్టడికి కాంగ్రెస్ యత్నం**
**కాటిపల్లి వెంకటరమణారెడ్డి, షబ్బీర్ అలీల మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లు**
**ఎమ్మెల్యే ఇంటి ముట్టడికి కాంగ్రెస్ నాయకుల ప్రయత్నం**
**అడ్డుకున్న బీజేపీ కార్యకర్తలు**
**రంగంలోకి దిగి కాంగ్రెస్ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్న పోలీసులు**



**కామారెడ్డి, జై భీమ్ న్యూస్**

బీజేపీకి చెందిన కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి క్యాంప్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నాయకుడు గీరెడ్డి మహేందర్ రెడ్డి కామారెడ్డిలోని ఎమ్మెల్యే ఇంటిని ముట్టడించేందుకు ప్రయత్నించారు. కాటిపల్లి వెంకటరమణారెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎమ్మెల్యేకు మద్దతుగా బీజేపీ కార్యకర్తలు తరలి వచ్చారు. కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో మహేందర్ రెడ్డి కారును బీజేపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. గత కొన్ని రోజులుగా వెంకటరమణారెడ్డి, షబ్బీర్ అలీలు కామారెడ్డి అభివృద్ధి, అవినీతిపై సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకుంటున్నారు. ప్రభుత్వ కాలేజీ భూములు, శిశుమందిర్ పాఠశాల, అరోరా కాలేజీ విషయంలో కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడంతో, తాను చర్చకు సిద్ధమని కాటిపల్లి వెంకటరమణారెడ్డి ప్రకటించారు. కామారెడ్డిలో ఏం జరిగిందో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని అన్నారు. అందుకే తాను చర్చకు వస్తానని చెప్పారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి రావడంతో ఉద్రిక్తత ఏర్పడింది. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. క్యాంపు కార్యాలయానికి లేదా శిశుమందిర్ పాఠశాల వద్దకు ఎవరూ రావొద్దని విజ్ఞప్తి చేశారు. తన కుటుంబంపై కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేశారని, కాబట్టి తానే తేల్చుకుంటానని అన్నారు. కార్యకర్తలు సంయమనం పాటించాలని కోరారు.

# చంచల్‌గూడ జైలు ములాఖత్‌లలో ఉగ్రకుట్ర

**స్పందించిన పోలీసు అధికారి**
**ఉగ్రకుట్రల వార్తలన్నీ వదంతులే అన్న డీఐజీ**
**జాతీయ భద్రతకు సంబంధించిన అంశాల్లో నిజానిజాలు తెలుసుకోవాలని సూచన**
**ప్రముఖ ఛానళ్లలో ప్రచారం జరిగితే ప్రజలు భయాందోళనకు గురవుతారన్న డీఐజీ**



**చంచల్‌గూడ, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలు ములాఖత్‌లలో ఉగ్రకుట్రకు ప్రణాళికలు రచించారనే ప్రచారంపై పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. ఉగ్రకుట్రల వార్తలన్నీ వదంతులేనని స్పష్టం చేశారు. ఈ మేరకు డీఐజీ శ్రీనివాస్ మాట్లాడుతూ, రెండు రోజులుగా సామాజిక మాధ్యమాలు, కొన్ని ఛానళ్లలో చంచల్‌గూడ జైలు నుంచి ఉగ్రకుట్ర అని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోందని, ఇందులో ఎలాంటి వాస్తవం లేదని తెలిపారు. జాతీయ భద్రతకు సంబంధించిన అంశాల్లో ఏదైనా విషయాన్ని ప్రసారం చేయడానికి ముందు నిజానిజాలు ధృవీకరించుకోవాలని సూచించారు. బాధ్యతాయుతమైన మీడియా ఛానళ్లు ఇలాంటి విషయాలలో అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ప్రముఖ ఛానళ్లలో ఇలాంటి వార్తలు వస్తే ప్రజలు భయాందోళనకు గురవుతారని అన్నారు. ప్రజల్లోని ఆందోళన తొలగించడానికే ఈరోజు మీడియా ముందుకు వచ్చామని అన్నారు. చంచల్‌గూడ జైల్లో లష్కరేకు చెందిన ఉగ్రవాది ఒక్కడే ఉన్నాడని తెలిపారు. అతనికి కూడా భార్యతో తప్ప ఎవరితోనూ ములాఖత్ లేదని స్పష్టం చేశారు.

# ఏపీ లిక్కర్ స్కాం: ఏ2 నిందితుడు వాసుదేవరెడ్డికి రిమాండ్

**విజయవాడ, జై భీమ్ న్యూస్**

ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ కేసులో రెండో నిందితుడిగా (ఏ2) ఉన్న వాసుదేవరెడ్డిని అధికారులు ఈరోజు అరెస్ట్ చేశారు. అనంతరం విజయవాడలోని ఏసీబీ కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం అతనికి ఫిబ్రవరి 27 వరకు రిమాండ్ విధించింది. దీంతో పోలీసులు వాసుదేవరెడ్డిని గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. ఈ సందర్భంగా సిట్ అధికారులు కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో పలు కీలక విషయాలను వెల్లడించారు. ఈ మద్యం కుంభకోణంలో వాసుదేవరెడ్డి పాత్రే అత్యంత కీలకమని సిట్ నిర్ధారించింది. లభించిన సాంకేతిక ఆధారాలు, ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులు, విచారించిన సాక్షుల వాంగ్మూలాలన్నీ వాసుదేవరెడ్డి ప్రమేయాన్ని స్పష్టం చేస్తున్నాయని రిపోర్టులో పేర్కొంది. మద్యం అమ్మకాలు, కొనుగోళ్లు, ఆర్డర్లు, సరఫరా వరకు మొత్తం వ్యవహారాన్ని వాసుదేవరెడ్డి తన కనుసన్నల్లోనే నడిపారని సిట్ తెలిపింది. ఆబ్కారీ కార్యకలాపాలు ఆన్‌లైన్‌లో ఉండగా, ఎలాంటి అనుమతులు లేకుండా వాటిని మ్యాన్యువల్‌గా మార్చడంలో ఆయన కీలకపాత్ర పోషించినట్లు తేలింది. ఈ కుంభకోణంలో ఒక సిండికేట్‌గా ఏర్పడి అధికారులు, సిబ్బందిని నడిపించారని, ఈ కేసులో ఏ1గా ఉన్న రాజశేఖర్ రెడ్డి, అతని అనుచరుల ద్వారా సెటిల్‌మెంట్‌లు చేశారని సిట్ తన రిపోర్టులో వివరించింది.

# అగ్రి షో వంటి కార్యక్రమాలు ప్రభుత్వం నిర్వహిస్తే మేలు జరుగుతుంది: హరీశ్ రావు

**ఎన్టీఆర్ మైదానంలో ఏర్పాటు చేసిన అగ్రి షోను సందర్శించిన హరీశ్ రావు**
**తెలంగాణలో యూరియా కొరతను నివారించాలని డిమాండ్**
**రైతులకు ఆధునిక పరికరాలను సబ్సిడీపై ఇవ్వాలని డిమాండ్**



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

రైతుబడి అగ్రి షో వంటి కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తే రైతులకు మేలు జరుగుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ మైదానంలో ఏర్పాటు చేసిన అగ్రి షోను ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ, తెలంగాణలో యూరియా కొరతను నివారించాలని డిమాండ్ చేశారు. రైతులకు ఆధునిక పరికరాలను సబ్సిడీపై ఇవ్వాలని అన్నారు. సాగు పనిముట్లకు రాయితీపై రైతుల పక్షాన అసెంబ్లీలో చర్చిస్తామని హరీశ్ రావు వెల్లడించారు. అగ్రి వంటి కార్యక్రమాలు రైతులకు అన్ని రకాలుగా దోహదపడుతాయని అన్నారు. ఈ అగ్రి షో కార్యక్రమంలో రైతుబడికి చెందిన రాజేందర్ రెడ్డి మాజీ మంత్రి హరీశ్ రావుపై ప్రశంసలు కురిపించారు. హరీశ్ రావు మంత్రిగా ఉన్న సమయంలో స్వయంగా తనకు ఫోన్ చేసి సాగర్‌లో స్థానిక పరిపాలన లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, దీని మీద వార్తలు రాస్తే దాని ఆధారంగా చర్యలు తీసుకుంటానని తనకు చెప్పారని గుర్తుచేసుకున్నారు. అప్పుడు నాగార్జున సాగర్ ప్రాజెక్టు కింద పాలన ఉండేదని అన్నారు. ఆ సమయంలో తాను రెండు మూడు వార్తలు రాశానని, మిగతా మీడియా కూడా స్పందించి వార్తలు రాసిందని అన్నారు. వాటి ఆధారంగా హరీశ్ రావు నాగార్జున సాగర్‌ను మున్సిపాలిటీగా చేసి స్థానిక పాలన జరిగేలా చేశారని గుర్తు చేసుకున్నారు.

# ఏఐ సమ్మిట్ వద్ద యూత్ కాంగ్రెస్ నిరసనలపై కేటీఆర్ స్పందన

**అంతర్జాతీయ సదస్సులను రాజకీయ ప్రదర్శనలకు ఉపయోగించడంపై కేటీఆర్ మండిపాటు**
**ఇది దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే చర్య అని వ్యాఖ్య**
**ఇలాంటి వేదికల్లో హుందాగా వ్యవహరించాలని సూచన**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**



ఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ - 2026 వేదిక వద్ద యూత్ కాంగ్రెస్ నాయకులు చేసిన నిరసనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఇలాంటి అంతర్జాతీయ సదస్సులను రాజకీయ ప్రదర్శనలకు ఉపయోగించడం దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే చర్య అని అభివర్ణించారు. అంతర్జాతీయ సదస్సులు దేశ ప్రతిభను, సామర్థ్యాన్ని ప్రపంచానికి చూపించే వేదికలని అన్నారు. ఇలాంటి వేదికల్లో హుందాగా వ్యవహరించాలని చెప్పారు. రాజకీయ విభేదాలు సహజమే అయినా... అభిప్రాయ భేదాలను వ్యక్తపరచడానికి సరైన సమయం, సరైన వేదిక ఉండాలని కేటీఆర్ అన్నారు. గ్లోబల్ ఈవెంట్‌లలో ఇలాంటి నిరసనలు చేపట్టడం వల్ల భారత్‌పై అంతర్జాతీయంగా ప్రతికూల అభిప్రాయం ఏర్పడే ప్రమాదం ఉందని విమర్శించారు. ఈ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలోనే యూత్ కాంగ్రెస్ నాయకులు నిరసన చేయడం చాలా విచిత్రంగా ఉందని వ్యాఖ్యానించారు.

# పరీక్షలు ఉన్నాయని ఆందోళన వద్దు

**ఇంటర్ విద్యార్థులకు కవిత సూచన**
**ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాయాలని సూచన**
**పరీక్షలు బాగా రాయలేననే ఆందోళన వద్దన్న కవిత**
**పరీక్షలు అనేవి పూర్తి జీవితంలో చిన్న అంశమని వ్యాఖ్య**



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఈ నెల 25వ తేదీ నుంచి జరగనున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విద్యార్థులకు సూచనలు చేశారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా, పూర్తి ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆమె ఆకాంక్షించారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులందరికి ఆమె శుభాకాంక్షలు తెలిపారు. పరీక్షల్లో ఆందోళనకు గురికాకుండా ఎంత వస్తే అంత రాయాలని సూచించారు. ఫలితాల కోసం ఏమాత్రం ఆందోళన చెందవద్దని విజ్ఞప్తి చేశారు. పరీక్షలు బాగా రాయలేనేమోననే ఆందోళనతో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నట్లు వార్త చూశానని, కాబట్టి ఫలితాల గురించి భయపడవద్దని అన్నారు. పరీక్షలు అనేవి జీవితంలో చిన్న పందెమని గుర్తుంచుకోవాలని సూచించారు. ఒక పరీక్ష సరిగ్గా రాయకుంటే మన జీవితం అంతటితో ఆగిపోదని అన్నారు. పరీక్షల తర్వాత ఎంతో జీవితం ఉందని వ్యాఖ్యానించారు. పరీక్షల భయంతో ఏదైనా చేసుకుంటే తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఎంత క్షోభిస్తారో గుర్తుంచుకోవాలని అన్నారు. పరీక్షల వంటి చిన్న చిన్న అంశాలను దాటుకుంటూ వెళితే జీవితంలో పెద్ద పెద్ద వాటిని సులభంగా ఎదుర్కోవచ్చని అన్నారు.

జై భీమ్
POWER OF PEOPLE
Jai Bheem

# యువమోర్చా నేతలపై థర్డ్ డిగ్రీ అత్యంత దుర్మార్గం!

**తెలంగాణ బీజేపీ చీఫ్ రామచందర్ రావు**
**బీజేవైఎం నేతల అరెస్ట్‌పై బీజేపీ తీవ్ర ఆగ్రహం**
**పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ఆరోపణ**
**సీఎం రేవంత్ రెడ్డి ప్రోద్బలంతోనే దాడులన్న బీజేపీ**
**దాడికి పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్



తెలంగాణలో బీజేపీ యువమోర్చా (బీజేవైఎం) నేతలపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల మెప్పు పొందేందుకే పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ దాడులకు తెగబడ్డారని ఆయన మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రోద్బలంతోనే ఈ దారుణం జరిగిందని, ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అని తీవ్రంగా ఖండించారు. వివరాల్లోకి వెళితే, ఇటీవల జరిగిన 'ఏఐ గ్లోబల్ సమ్మిట్'లో కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన తీరు దేశానికి తలవంపులు తెచ్చిందని ఆరోపిస్తూ బీజేపీ నిరసనకు పిలుపునిచ్చింది. ఈ క్రమంలో, బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి శాంతియుతంగా నిరసన తెలిపేందుకు బయలుదేరిన బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేశ్ కుండెతో పాటు ఇతర నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని రామచందర్ రావు తెలిపారు. ఇది ప్రజాస్వామిక హక్కులను కాలరాయడమేనని అన్నారు. అంతేకాకుండా, అరెస్టు చేసిన నాయకులను పోలీస్ వ్యాన్‌లో తరలిస్తుండగా, వారి పట్ల అసభ్య పదజాలం వాడుతూ థర్డ్ డిగ్రీ ప్రయోగించడం హేయమైన చర్య అని విమర్శించారు. కేవలం ఢిల్లీలో ఉన్న రాహుల్ గాంధీ మెప్పు పొందడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఇంతటి దిగజారుడు చర్యలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. పోలీసులు తమ విధులను పక్కనపెట్టి, కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్న కార్యకర్తల్లా వ్యవహరించడం మానుకోవాలని హెచ్చరించారు. కేంద్రంలో అధికారంలో ఉన్నది జాతీయ పార్టీ అయిన బీజేపీ అనే స్పృహ పోలీసులకు ఉండాలని గుర్తుచేశారు. ఈ దాడి ఘటనపై తక్షణమే స్పందించాలని, బీజేవైఎం నాయకులను దుర్భాషలాడి, దాడికి పాల్పడిన పోలీసు అధికారులపై విచారణ జరిపి, వారిని తక్షణమే సస్పెండ్ చేయాలని రామచందర్ రావు డిమాండ్ చేశారు. అంతేకాకుండా, బాధ్యులైన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

# కాటిపల్లి ఇంటిపై కాంగ్రెస్ గూండాయిజం చేసింది

**రేవంత్ సమాధానం చెప్పాలి: ఈటల రాజేందర్**
**ఎమ్మెల్యే ఇంటిపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారన్న ఎంపీ**
**సామాన్యులకు రక్షణ ఎలా ఇస్తుందో ముఖ్యమంత్రి చెప్పాలని నిలదీత**
**కామారెడ్డిలో రేవంత్ రెడ్డిని కాటిపల్లి ఓడించడం కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతోందని వ్యాఖ్య**

కామారెడ్డి, జై భీమ్ న్యూస్



కామారెడ్డి బీజేపీ శాసనసభ్యుడు కాటిపల్లి వెంకటరమణారెడ్డి నివాసంపై కాంగ్రెస్ శ్రేణుల దాడిని బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఖండించారు. వెంకటరమణారెడ్డికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ఎమ్మెల్యే నివాసంపై కాంగ్రెస్ శ్రేణుల దాడిపై స్పందించారు. ఒక ఎమ్మెల్యే ఇంటిపై కాంగ్రెస్ పార్టీ దాడి చేసి గూండాయిజం చేస్తోందని ఈటల రాజేందర్ ధ్వజమెత్తారు. ఇలాంటి ప్రభుత్వం ఇక సామాన్య ప్రజలకు ఏం రక్షణ ఇస్తుందో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఇలాంటి దాడులను ఎట్టి పరిస్థితుల్లో సహించరని, హింసను క్షమించరని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఓడించారని, ఆ తర్వాత అక్కడ బీజేపీ క్రమంగా మరింత బలపడుతోందని, దీనిని జీర్ణించుకోలేక కాంగ్రెస్ శ్రేణులు దాడులు చేస్తున్నాయని ఆరోపించారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ఇలాంటి అల్లర్లకు పాల్పడటం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ దాడికి రేవంత్ రెడ్డిదే బాధ్యత అన్నారు. కాటిపల్లి వెంకటరమణారెడ్డికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు అండగా ఉంటారని పేర్కొన్నారు.

# ఆ 'నాటకాల రాయుడు' రోజుకో వేషం వేశాడు: సీఎం చంద్రబాబు

విజయవాడ, జై భీమ్ న్యూస్

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జరిగిన నెయ్యి కల్తీ వ్యవహారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ మహా పాపానికి పాల్పడిన నిందితులను నడిరోడ్డుపై నిలబెట్టి శిక్షిస్తామని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. వారి కల్తీ అక్రమాల నుంచి తప్పించుకోవడానికే ఇప్పుడు హెరిటేజ్ సంస్థపై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. పల్నాడు జిల్లా వినుకొండలో నిర్వహించిన 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. 2024కు ముందు తిరుమల దర్శనానికి వెళ్లిన ప్రతి భక్తుడికి లడ్డూ ప్రసాదం నాణ్యత తగ్గిపోయిన విషయం అనుభవంలోకి వచ్చిందన్నారు. శ్రీవారి ప్రసాదం పవిత్రతను దెబ్బతీసే అధికారం ఎవ్వరికీ లేదని, కానీ గత పాలకులు దాన్ని అపవిత్రం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. "వారు కొనుగోలు చేసిన నెయ్యి నమూనాలను గుజరాత్‌లోని నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డుకు (చీణణదీ) పరీక్షల నిమిత్తం పంపిస్తే, అది అసలు నెయ్యే కాదని, అందులో జంతువుల కొవ్వు కలిసిందని ల్యాబ్ నివేదిక ఇచ్చింది. దీనిపై ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సెట్) సైతం తన నివేదికలో కీలక విషయాలను వెల్లడించింది. సరఫరా చేసింది నెయ్యి కాదని, కేవలం రసాయనాలతో తయారు చేసినట్లు తేల్చింది" అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ తప్పును తాము బయటపెడుతుంటే, దొంగే దొంగా అని అరిచినట్లుగా తిరిగి ప్రభుత్వంపైనే బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆక్షేపించారు. వివేకానంద రెడ్డి హత్య ఘటనను ప్రస్తావిస్తూ... ఆ 'నాటకాల రాయుడు' రోజుకో వేషం వేశాడని, చివరకు తన చిన్నాన్న కుమార్తె కూడా మోసపోయేలా నాటకాలు రక్తి కట్టించాడని పరోక్షంగా జగన్‌ను ఉద్దేశించి విమర్శించారు.

# కొండాపూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్

**రూ.1,400 కోట్ల విలువైన భూమికి రక్షణ**
**కొండాపూర్‌లో 7 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా**
**కబ్జాకు గురైన పార్కులు, ప్రజావసరాల స్థలాలను స్వాధీనం చేసుకున్న హైడ్రా**
**ఆక్రమణలు తొలగించి, స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన అధికారులు**
**కాలనీ సంక్షేమ సంఘం ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం**
**దశాబ్దాల సమస్య పరిష్కారమవడంతో స్థానికుల ఆనందం**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్




హైదరాబాద్ నగర శివారులోని అత్యంత ఖరీదైన ప్రాంతమైన కొండాపూర్‌లో కబ్జాకు గురైన సుమారు 7 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. దీని విలువ బహిరంగ మార్కెట్‌లో దాదాపు రూ. 1,400 కోట్లు ఉంటుందని అంచనా. అధికారులు ఆక్రమణలను తొలగించి, శనివారం ఆ స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ప్రభుత్వ బోర్డులను సైతం ఏర్పాటు చేశారు. వివరాల్లోకి వెళితే, రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్‌లోని సర్వే నంబర్ 78 నుంచి 93 పరిధిలో రాజరాజేశ్వరి నగర్ కాలనీ పేరుతో 1993లో గ్రామపంచాయతీ లేఅవుట్ వేశారు. ఈ లేఅవుట్‌లో ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 5 ఎకరాలు, పాఠశాలకు ఒక ఎకరా, పార్కులకు ఎకరాకు పైగా, కమ్యూనిటీ హాల్ కోసం 2181 గజాల స్థలాన్ని కేటాయించారు. అయితే, కాలక్రమేణా ఈ విలువైన స్థలాలు కబ్జాకు గురయ్యాయి. పాఠశాల స్థలంలో అపార్ట్‌మెంట్, కమ్యూనిటీ హాల్ స్థలంలో ప్రైవేటు దుకాణాలు, షెడ్లు వెలిశాయి. ఈ ఆక్రమణల వెనుక బడాబాబులు ఉన్నారని, ప్రజావసరాల కోసం కేటాయించిన భూములను కాపాడాలని రాజరాజేశ్వరి నగర్ కాలనీ సంక్షేమ సంఘం హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. లేఅవుట్‌లోని ప్లాట్లు ఎల్ఆర్ఎస్ అయినప్పుడు, పార్కులు, ప్రజావసరాల స్థలాలు ఎలా ఆక్రమణదారుల సొంతమవుతాయని వారు ప్రశ్నించారు. ఈ ఫిర్యాదుపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెంటనే స్పందించి, అధికారులను క్షేత్రస్థాయి పరిశీలనకు ఆదేశించారు. లేఅవుట్ ప్రకారం ఆ భూములు ప్రజావసరాలకు చెందినవేనని నిర్ధారించుకున్న అధికారులు, వెంటనే ఆక్రమణలను తొలగించి, భూమి చుట్టూ ఫెన్సింగ్ వేశారు. దశాబ్దాలుగా పరిష్కారం కాని తమ సమస్యకు హైడ్రా పరిష్కారం చూపడంతో రాజరాజేశ్వరి నగర్‌లోని సుమారు 5 వేల కుటుంబాలు హర్షం వ్యక్తం చేశాయి. తమకు అండగా నిలిచిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపాయి.

# కామారెడ్డిలో ఇక సినిమా చూపిస్తాం

**కాటిపల్లి వెంకటరమణారెడ్డి హెచ్చరిక**
**రేవంత్ రెడ్డి చెబుతున్న ప్రజాపాలన ఇదేనా అని నిలదీత**
**కామారెడ్డిలో ఈరోజు చూసింది ట్రైలర్ మాత్రమే అన్న ఎమ్మెల్యే**
**తమ కార్యకర్తలను సంయమనం పాటించాలని కోరానన్న ఎమ్మెల్యే**



హైదరాబాద్, జై భీమ్ న్యూస్

రేపటి నుంచి ఇక నుంచి యుద్ధ వాతావరణమేనని, వదిలిపెట్టే ప్రసక్తి లేదని కామారెడ్డి బీజేపీ శాసనసభ్యుడు కాటిపల్లి వెంకటరమణారెడ్డి హెచ్చరిక జారీ చేశారు. కామారెడ్డికి ఏ ఇన్‌ఛార్జ్ మంత్రి వచ్చినా తాము నిలదీస్తూనే ఉంటామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్న ప్రజాపాలన ఇదేనా అని నిలదీశారు. సీఎంకు సమాధానం చెప్పే పాలన ఇక్కడి నుంచే ప్రారంభమవుతుందన్నారు. ఇష్టారీతిన మాట్లాడితే ఈరోజు ఏం జరిగిందో చూశారని అన్నారు. కామారెడ్డిలో ఈరోజు జరిగింది జస్ట్ ట్రైలర్ మాత్రమేనని, అసలు సినిమా ముందుందని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు మర్యాదగా ప్రవర్తిస్తే మేం మర్యాదగా ఉంటామని లేదంటే మేం అలాగే స్పందిస్తామని స్పష్టం చేశారు. కామారెడ్డిలో ఉదయం ఘర్షణ వాతావరణం ఉన్న సమయంలో తమ కార్యకర్తలు సంయమనం పాటించాలని కోరానని, ఎవరూ ఇక్కడకు రావొద్దని సూచించానని వెల్లడించారు. అదే తాను పిలిస్తే వేల మంది వచ్చేవారని, అప్పుడు పరిస్థితి ఉద్రిక్తంగా మారేదని తెలిపారు. అవినీతి ఆరోపణలపై నిరూపించాలని తాను సవాల్ చేశానని అన్నారు. నేను తప్పు చేస్తే తనను కాంగ్రెస్ నాయకులు చెప్పుతో కొట్టవచ్చని, కానీ తనపై చేసిన ఆరోపణలు అవాస్తవమని తేలితే వారికి ఏ శిక్ష విధించాలో వారే చెప్పాలని అన్నారు. అవినీతి ఆరోపణలు నిరూపించడానికి తనపై ఆరోపణలు చేసిన కాంగ్రెస్ నాయకుడు, తాను, అధికారులు మాత్రమే రావాలని చెప్పానని, కానీ కాంగ్రెస్ కార్యకర్తలు ఎందుకు తరలి వచ్చారని ప్రశ్నించారు. వేలాదిమంది తరలి వచ్చి ఏం చేయాలనుకున్నారని ప్రశ్నించారు.

# ఎనిమిదో తరగతి బాలికపై గ్యాంగ్ రేప్

**చార్మినార్ దగ్గర పరిచయమైన నిందితుడు**
**మాయమాటలతో చెంగిచెర్లకు తీసుకెళ్లిన వైనం**
**గంజాయి, మద్యం తాగించి రాక్షసత్వం**
**పాత నేరస్థుడితో పాటు ఇద్దరు బాలుర ఘాతుకం**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

పరిచయం ఉన్న బాలుడే కదా అని నమ్మి వెళ్లిన ఆ బాలికకు ప్రాణ సంకటమైంది. మాయమాటలతో తీసుకెళ్లి, కత్తులతో బెదిరించి, బలవంతంగా మద్యం తాగించి రాత్రంతా నరకం చూపించారు ముగ్గురు మృగాళ్లు. హైదరాబాద్ శివారు చెంగిచెర్లలోని ఖాళీగా ఉన్న ఓ డబుల్ బెడ్రూం ఇల్లు ఈ దారుణానికి వేదికైంది. నార్సింగిలో నివాసం ఉంటున్న ఎనిమిదో తరగతి బాలికకు, చార్మినార్ మదీనా వద్ద పాత పరిచయమున్న ఓ బాలుడు (16) తారసపడ్డాడు. స్నేహం పేరుతో ఫోన్ నంబర్ తీసుకున్న సదరు బాలుడు, వారం రోజుల తర్వాత ఆమెను కలవాలని పిలిచాడు. ఈ నెల 16న స్కూల్‌కు అని చెప్పి వెళ్లిన బాలిక, చార్మినార్‌లో అతడిని కలిసింది. అక్కడ మరో ఇద్దరు స్నేహితులతో కలిసి ఆమెకు బిర్యానీ తినిపించి, ఆటోలో చెంగిచెర్లకు తీసుకెళ్లారు. నిందితుల్లో ఒకడైన ఇమ్రాన్ తల్లిదండ్రులకు ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్రూం ఇల్లు ప్రస్తుతం ఖాళీగా ఉంది. ఆ ఇంటికి తీసుకెళ్లి బాలికకు బలవంతంగా మద్యం తాగించారు. ఆమె అడ్డు తిరగడంతో కత్తులతో చంపేస్తామని బెదిరించి ముగ్గురూ సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. రాత్రయినా బాలిక ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. నార్సింగి పోలీసులు సాంకేతిక ఆధారాలతో గాలించి చెంగిచెర్లలోని ఇంట్లో ఉన్న బాలికను రక్షించారు. నిందితుల్లో ఒకడైన ఇమ్రాన్ (21)పై ఇప్పటికే 8 కేసులు ఉన్నాయని, అతడు రెయిన్ బజార్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్ అని తేలింది. అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బాలుడి (16)ని జువైనల్ హోమ్‌కు తరలింపు. పరారీలో మరో బాలుడి కోసం గాలింపు కొనసాగుతోంది. నిందితులు ముగ్గురూ తలాబ్‌కట్ట ప్రాంతానికి చెందిన వారని, వీరు చిన్న చిన్న దొంగతనాలు, గొడవలకు పాల్పడే బ్యాచ్ అని పోలీసులు గుర్తించారు. బాధితురాలు ప్రస్తుతం ఆసుపత్రిలో కోలుకుంటోంది.

# ఏఐ సదస్సు బీజేపీ కార్యక్రమం కాదు, భారత్ అంటే మోదీ ఒక్కరే కాదు: తెలంగాణ మంత్రి పొన్నం

**ఏఐ సదస్సు భారత ప్రభుత్వం నిర్వహిస్తుందన్న పొన్నం ప్రభాకర్**
**ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రతిపక్షాలను గౌరవించాలన్న మంత్రి**
**ఏఐ సదస్సును అడ్డుకునే ఉద్దేశం కాంగ్రెస్ పార్టీకి లేదని వ్యాఖ్య**




హైదరాబాద్, జై భీమ్ న్యూస్

దేశ రాజధాని ఢిల్లీలోని 'ఏఐ ఇంపాక్ట్' సదస్సులో నిన్న జరిగిన ఘటనపై తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. భారత మండపంలో జరుగుతోన్న సదస్సు వేదిక వద్దకు యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చేరుకుని చొక్కాలు విప్పి నిరసన తెలిపారు. హాల్ నెంబర్ 5లోకి ప్రవేశించి మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఢిల్లీ పోలీసులు నిరసనకారులను అరెస్టు చేశారు. ఈ ఘటనపై మంత్రి స్పందించారు. ఏఐ ఇంపాక్ట్ సదస్సు బీజేపీ పార్టీది కాదని, అది భారత ప్రభుత్వం నిర్వహిస్తోందని పొన్నం ప్రభాకర్ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ఇది అంతర్జాతీయ కార్యక్రమమని గుర్తు చేశారు. భారత్ అంటే ప్రధాని నరేంద్ర మోదీ ఒక్కరే కాదని, ప్రతిపక్ష నాయకులను కూడా గౌరవించాలన్న విషయం గుర్తించాలని అన్నారు. తెలంగాణ విజన్ 2047 భారత సమ్మిట్ కార్యక్రమం నిర్వహించినప్పుడు కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, మాజీ సీఎం కేసీఆర్‌లను ఆహ్వానించామని అన్నారు. దేశ అభివృద్ధికి ఆయా రాష్ట్రాల ఐక్యత అవసరమని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వివక్ష పూర్తికంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. ఏఐ సదస్సును అడ్డుకోవాలనే ఉద్దేశం కాంగ్రెస్ పార్టీకి ఏ కోశాన లేదని, కానీ నిన్న కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు వారి సంకుచిత బుద్ధికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రపంచ దేశాల ముందు దేశ నాయకులమంతా ఒక్కటేనని చాటాల్సి ఉందని, కానీ బీజేపీ ప్రభుత్వం ప్రతిసారి ప్రతిపక్ష నాయకులను అవవమానిస్తోందని విమర్శించారు. గణతంత్ర దినోత్సవం రోజున రాహుల్ గాంధీకి మూడో వరుసలో సీటును కేటాయించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు ప్రధానమంత్రితో సమానంగా ప్రతిపక్ష నాయకులను గౌరవించామని అన్నారు. కానీ బీజేపీ ప్రభుత్వం ప్రతి విషయంలో సంకుచితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రాజకీయాలు ఉంటే పార్లమెంటు వేదికగా, ఎన్నికల్లో చూసుకోవాలని, కానీ అంతర్జాతీయ సదస్సు జరిగినప్పుడు ప్రతిపక్ష నాయకుడిని పిలవకుండా దూరం పెట్టడం సరికాదని అన్నారు. ఇదెక్కడి రాజనీతి అని ప్రశ్నించారు. భారత పురాణ గాథల్లో విశాల దృక్పథం ఉంటుందని, మన ప్రభుత్వం కూడా ఆ విశాల దక్పథాన్ని చాటుకోవాలని అన్నారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడిని అవమానించి ఏం సాధించాలనుకుంటున్నారని ప్రశ్నించారు. సూర్యుడి మీద ఉమ్మేస్తే మీ ముఖం మీదనే పడుతుందని గుర్తించాలని అన్నారు. అరచేతిని అడ్డుపెట్టి సూర్యకిరణాలను ఆపలేరని... రాహుల్ గాంధీని మీరు ఎంత అడ్డుకుంటే ఆయన వైభవం, కీర్తి అంత ఎత్తుకు ఎదుగుతాయని అన్నారు. రాహుల్ గాంధీ పదవుల కోసం పాకులాడే వ్యక్తి కాదని పొన్నం ప్రభాకర్ అన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన కుటుంబం గాంధీలది అని తెలిపారు. ప్రపంచ దేశాల్లో గాంధీ కుటుంబం అంటే ఇండియాకు పర్యాయపదంగా ఉండేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం విధానాలు మారి ప్రపంచ దేశాల ముందు భారత్ ఐక్యతను చాటాలని విజ్ఞప్తి చేశారు.

# శ్రీశైలంలో భక్తులకు తప్పిన పెను ప్రమాదం

శ్రీశైలం, జై భీమ్ న్యూస్

శ్రీశైలం పుణ్యక్షేత్రంలో భక్తులకు పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. యాత్రికులు బస చేసిన ఓ వీఐపీ కాటేజీలో అగ్నిప్రమాదం సంభవించింది. అప్రమత్తమైన భక్తులు వెంటనే బయటకు పరుగులు తీయడంతో ఎవరికీ ఎలాంటి హాని జరగలేదు. ఈ ఘటనతో అక్కడున్న వారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. శ్రీశైలంలోని ఓ వీఐపీ కాటేజీ గదిలో ఉన్న ఎయిర్ కండిషనర్ (ఏసీ)లో షార్ట్ సర్క్యూట్ అయింది. దీంతో ఏసీ నుంచి ఒక్కసారిగా దట్టమైన పొగతో పాటు మంటలు చెలరేగాయి. ఆ సమయంలో గదిలో ఉన్న భక్తులు మంటలను గమనించి, భయంతో కేకలు వేస్తూ గది నుంచి బయటకు పరుగులు తీశారు. వారి అరుపులతో కాటేజీలోని ఇతర గదుల్లో ఉన్న వారు కూడా అప్రమత్తమై భవనం నుంచి బయటకు వచ్చారు.

# న్యాయవాది స్వప్న హత్య కేసులో మరో విషాదం

**గుండె ఆగి చనిపోయిన తల్లి**
**ఆస్తి కోసం అన్న చేతిలో హత్యకు గురైన న్యాయవాది స్వప్న**
**కూతురి మరణాన్ని తట్టుకోలేక తల్లి మల్లమ్మ కన్నుమూత**
**హత్య కేసులో ప్రధాన నిందితుడు రాజు సహా పలువురికి రిమాండ్**
**మరో తల్లి వెంకటమ్మ పరిస్థితి కూడా ఆందోళనకరం**

రంగారెడ్డి, జై భీమ్ న్యూస్

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో సంచలనం సృష్టించిన న్యాయవాది స్వప్న హత్య కేసులో మరో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కంటికి రెప్పలా చూసుకున్న కూతురు, తోడబుట్టిన అన్న చేతిలోనే దారుణ హత్యకు గురైందన్న వార్తను జీర్ణించుకోలేక ఆమె తల్లి మల్లమ్మ (70) గురువారం తుదిశ్వాస విడిచారు. ఒకే కుటుంబంలో చోటుచేసుకున్న ఈ రెండు మరణాలతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. వివరాల్లోకి వెళితే.. పదేళ్ల క్రితం తండ్రి శాంతయ్య చనిపోయాడు. ఆయనకు ఇద్దరు భార్యలు. న్యాయవాది అయిన స్వప్న తన ఇద్దరు తల్లులు వెంకటమ్మ, మల్లమ్మల బాగోగులను చూసుకుంటున్నారు. అయితే, ఆస్తిపై కన్నేసిన స్వప్న సోదరుడు రాజు.. మరో ముగ్గురితో కలిసి ఆమెను కిరాతకంగా హత్య చేశాడు. అండగా ఉన్న కూతురు హత్యకు గురవడం, కన్న కొడుకే హంతకుడిగా మారడంతో మల్లమ్మ తీవ్ర మానసిక వేదనకు గురయ్యారు. ఆరోగ్యం క్షీణించడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె కన్నుమూశారు. మరో తల్లి వెంకటమ్మ పరిస్థితి కూడా ఆందోళనకరంగానే ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ హత్య కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం, ప్రధాన నిందితుడైన రాజుతో పాటు అతనికి సహకరించిన వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించింది. ఆస్తి పత్రాల కోసం జరిగిన ఈ ఘాతుకంలో ఇంకెవరైనా ఉన్నారా? అనే కోణంలో పోలీసులు ఫోన్ కాల్ డేటాను విశ్లేషిస్తున్నారు. మల్లమ్మ మరణించడానికి మూడు రోజుల ముందే పోలీసులు ఆమె నుంచి వాంగ్మూలం సేకరించినట్లు తెలిసింది.



# రీల్స్ చూసి లొకేషన్ వేట..

**60 రోజుల స్కెచ్.. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సునీత హత్య వెనుక భయంకర నిజాలు!**
**సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సునీత హత్య యాదృచ్ఛికం కాదు**
**ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ ద్వారా ఆచూకీ కనిపెట్టిన మాజీ భర్త మహేశ్**
**కట్టర్ మెషిన్, పెప్పర్ స్ప్రేతో దాడి**
**హత్య కోసం రెండు నెలల పాటు రెక్కీ నిర్వహించిన వైనం**
**నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు**

వనస్థలిపురం, జై భీమ్ న్యూస్

వనస్థలిపురంలో కలకలం రేపిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సునీత హత్య కేసులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఇది ఆవేశంలో జరిగిన హత్య కాదని, మాజీ భర్త మహేశ్ రెండు నెలల పాటు పక్కా ప్రణాళికతో అమలు చేసిన కిరాతక చర్య అని పోలీసుల దర్యాప్తులో తేలింది. మాజీ భార్యపై పెంచుకున్న కక్షతోనే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు నిందితుడు అంగీకరించాడు. పోలీసుల విచారణ ప్రకారం కెనడాలో ఉద్యోగం కోల్పోవడం, సునీత పెట్టిన కేసుల వల్ల తిరిగి అక్కడికి వెళ్లలేకపోవడంతో మహేశ్ ఆమెపై పగ పెంచుకున్నాడు. సునీత ఆచూకీ తెలుసుకోవడానికి ఆమె సోషల్ మీడియా ఖాతాలపై దృష్టి పెట్టాడు. ఆమె పోస్ట్ చేసిన ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌ను నిశితంగా పరిశీలించి, వీడియోల బ్యాక్‌గ్రౌండ్‌లో కనిపించిన పరిసరాల ఆధారంగా వనస్థలిపురంలోని కాప్రాయి చెరువు సమీపంలో ఆమె నివాసం ఉంటున్న అపార్ట్‌మెంట్‌ను గుర్తించాడు. హత్యకు వెళ్లే ముందు మహేశ్ యుద్ధానికి సిద్ధమైనట్లుగా సామగ్రిని సమకూర్చుకోవడం చూసి పోలీసులే ఆశ్చర్యపోయారు. ఆమె తలుపులు వేసుకుంటే కోసేందుకు గ్రైండర్ కట్టర్, ప్రతిఘటించకుండా కళ్లలో కొట్టేందుకు పెప్పర్ స్ప్రే, దాడి చేసేందుకు పదునైన కత్తులు వెంట తెచ్చుకున్నాడు. హత్య తర్వాత తాను కూడా పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకోవాలని ప్లాన్ చేసినట్లు విచారణలో వెల్లడైంది. సుమారు 60 రోజులు తుర్కయాంజిల్‌లోని ఓ హాస్టల్‌లో ఉండి నాలుగు రోజులు సునీత కదలికలపై రెక్కీ నిర్వహించాడు. సరైన సమయం చూసి, వాచ్‌మన్ లేని వేళ అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించి ఈ దారుణానికి ఒడిగట్టాడు. తాను చేసిన నేరానికి ఎలాంటి పశ్చాత్తాపం లేదని, ఏ శిక్షకైనా సిద్ధమని మహేశ్ పోలీసుల ఎదుట చెప్పినట్లు సమాచారం. సునీత రెండో భర్త శ్రీనాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మహేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. హత్యకు ఉపయోగించిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.



# ఇన్స్టా అకౌంట్ బ్యాన్ కావడంపై యూట్యూబర్ అన్వేష్ రియాక్షన్

**రూపాయి రాని ఇన్స్టా ఉంటే ఏంటి పోతే ఏంటి? అన్న అన్వేష్**
**ఎన్ని అకౌంట్లు బ్యాన్ చేసినా వీడియోలు చేయడం ఆపనని వ్యాఖ్య**
**గత నెల యూట్యూబ్ నుంచి రూ. 8 లక్షలు వచ్చాయని వెల్లడి**



హైదరాబాద్, జై భీమ్ న్యూస్

ప్రపంచ యాత్రల వీడియోలతో ఎంతో మంది ఫాలోయర్లను సంపాదించుకున్న తెలుగు యూట్యూబర్ 'నా అన్వేషణ' అన్వేష్ తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ బ్యాన్ అవ్వడంపై బోల్డ్ రియాక్షన్ ఇచ్చాడు. మరో ఇన్‌స్టా అకౌంట్ ఓపెన్ చేసి వీడియో పోస్ట్ చేసిన అతను... "ఇన్‌స్టా అకౌంట్ పోయినందుకు నాకేం బాధ లేదు. రూపాయి రాని ఇన్‌స్టా ఉంటే ఏంటి పోతే ఏంటి? ఇన్‌స్టా ఛానల్స్ prapranchayatrikudu, naa_anveshana5... యూట్యూబ్ ఛానల్స్ naa anveshana, prapancha yatrikudu నాకు రెండు చేతులు, రెండు కాళ్లు లాంటివి. ఫేస్ బుక్ అకౌంట్ నా బాడీతో సమానం. ఎన్ని అకౌంట్లు బ్యాన్ చేసినా వీడియోలు చేయడం ఆపను. అన్నీ బ్యాన్ చేసినా.. వాటన్నింటినీ నడిపించే నా మైండ్ ని ఏం చేయలేరు. ఒక చేతిని విరగ్గొడితే ఇంకో చెయ్యి, రెండు కాళ్లతో ముందుకు వెళతా. రెండో చెయ్యి పోతే రెండు కాళ్లతో వెళతా. కాళ్లు కూడా తీసేస్తే బాడీతో పాకుకుంటూ వెళతా. దాన్ని కూడా తీసేస్తే నా బుర్రే ఆయుధంగా పనిచేస్తుంది. ఎవరెన్ని చేసినా.. నేను చేయాల్సింది చేస్తా. ఇన్ స్టాలో నేను ఎలాంటి ప్రమోషన్లు, లింకులు ఇవ్వలేదు. అయినా నా అకౌంట్ బ్యాన్ చేయించారు. 2026లో బత్తాయిలకు నరకం చూపిస్తా. యూట్యూబ్ నుంచే గత నెల రూ.8 లక్షల ఆదాయం వచ్చింది" అని చెప్పుకొచ్చాడు. ఇటీవల అన్వేష్ చేసిన కొన్ని వీడియోలు నెట్టింట తీవ్రదుమారానికి దారితీశాయి. ఇండియా గురించి ఆయన చేసిన కామెంట్స్ దుమారం రేపాయి. ఈ నేపథ్యంలో సీసీఎస్ పోలీసుల సూచన మేరకు ఇన్స్టా యాజమాన్యం ఆయన అకౌంట్ ను బ్యాన్ చేసింది.

# పవన్ కల్యాణ్ చొరవతో కొణిదెల గ్రామానికి మహర్దశ

**రూ. 50 లక్షల విరాళంతో 90,000 లీటర్ల ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం**
**వివిధ పథకాల ద్వారా గ్రామానికి రూ. 6 కోట్లకు పైగా నిధులు**
**ఎన్నికల ముందు ఇచ్చిన దత్తత హామీని నెరవేరుస్తున్న పవన్**
**రోడ్లు, డ్రైన్లు, ఇళ్ల నిర్మాణంతో గ్రామ రూపురేఖల మార్పు**



నందికొట్కూరు, జై భీమ్ న్యూస్

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రత్యేక చొరవతో నంద్యాల జిల్లా, నందికొట్కూరు మండలంలోని కొణిదెల గ్రామ రూపురేఖలు మారుతున్నాయి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు గ్రామాభివృద్ధికి నడుం బిగించిన పవన్, తన వ్యక్తిగత విరాళంతో పాటు ప్రభుత్వ పథకాల ద్వారా కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేయించారు. ఆయన అందించిన రూ. 50 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు ద్వారా గ్రామస్థుల దశాబ్దాల తాగునీటి కష్టాలు తీరనున్నాయి. 2019 ఎన్నికల ప్రచార సమయంలో తన ఇంటి పేరుతో ఉన్న కొణిదెల గ్రామాన్ని దత్తత తీసుకుంటానని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. ఆ మాట ప్రకారం, గత ఏడాది నియోజకవర్గ పర్యటనలో రూ. 50 లక్షల విరాళం అందజేశారు. గ్రామస్థుల ప్రధాన సమస్య అయిన తాగునీటి ఎద్దడిని అధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా, ఆ నిధులతో 90,000 లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు నిర్మించాలని సూచించారు. ఈ ట్యాంకు ద్వారా గ్రామంలోని సుమారు 2,000 మందికి రక్షిత తాగునీరు అందనుంది. వేసవికి ముందే నిర్మాణం పూర్తి కావడం పట్ల పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేస్తూ, అధికారులను అభినందించినట్లు ఉప ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. ఈ ట్యాంకుతో పాటు ప్రభుత్వ పథకాల ద్వారా సుమారు రూ. 6 కోట్లకు పైగా నిధులను గ్రామానికి మళ్లించారు. 'పల్లెపండగ 1.0' కింద రూ. 20 లక్షలతో మూడు అంతర్గత రహదారులు పూర్తి కాగా, 'పల్లెపండగ 2.0'లో రూ. 45 లక్షలతో ఏడు సీసీ రోడ్ల పనులు పురోగతిలో ఉన్నాయి. గ్రామీణ రహదారి అభివృద్ధి సబ్ ప్లాన్ కింద కొణిదెల జిల్లా పరిషత్ స్కూల్ నుంచి లక్ష్మాపురం వరకు 5 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 4 కోట్లు, ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి గ్రామానికి రహదారి పునరుద్ధరణకు రూ. 45 లక్షలు మంజూరు చేయించారు. వీటితో పాటు గ్రామ ప్రజల విజ్ఞప్తి మేరకు 4 గోకులాలు, గృహ నిర్మాణ శాఖ ద్వారా 19 ఇళ్లు, నీటితొట్టెలు నిర్మించారు. ఉపాధి హామీ పథకం కింద రైతుల కోసం 49 ఫీడర్ ఛానల్స్‌ను అభివృద్ధి చేయడంతో పాటు, రెండు మైనర్ కాలువల పునరుద్ధరణ, మూడు కమ్యూనిటీ చెక్ డ్యామ్‌ల మరమ్మతులు కూడా పూర్తి చేశారు. ఇచ్చిన హామీ మేరకు గ్రామస్థులు కోరిన ప్రతి పనిని చేపడుతూ, కొణిదెల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి కార్యాలయం తన ప్రకటనలో పేర్కొంది.

# కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డికి స్వల్ప అస్వస్థత

**నిమ్స్ ఆసుపత్రికి తరలించిన కుటుంబ సభ్యులు**
**వాంతులు, విరేచనాల కారణంగా అస్వస్థత**
**ఫుడ్ పాయిజన్ అయినట్లు చెబుతున్న కుటుంబ సభ్యులు**




హైదరాబాద్, జై భీమ్ న్యూస్

మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను వెంటనే హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. వాంతులు, విరేచనాల కారణంగా అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది. ఆయనకు ఫుడ్ పాయిజన్ అయినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. నిమ్స్ వైద్యులు ఆయనకు చికిత్స అందిస్తున్నారు. కాగా, ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల అంశంలో జీవన్ రెడ్డి పార్టీ రాష్ట్ర నాయకులపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. జగిత్యాలలో గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన సంజయ్ కుమార్ కాంగ్రెస్‌తో కలిసి ఉండటాన్ని జీవన్ రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారు. ఇటీవల జగిత్యాల మున్సిపాలిటీలో ఎప్పటి నుంచో పార్టీలో ఉన్న తన వర్గానికి 20 టిక్కెట్లు ఇచ్చి, సంజయ్ కుమార్ వర్గానికి 30 టిక్కెట్లు ఇచ్చారని ఆరోపించారు. ఫలితాలు వెలువడిన తర్వాత సంజయ్ కుమార్ వర్గానికి ఛైర్మన్ పదవిని ఇవ్వడం పట్ల ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

# మైత్రివనం ఆదిత్య ఎన్‌క్లేవ్‌లో అగ్ని ప్రమాదం... తప్పిన ముప్పు

**రాందేవ్ ఇన్ఫోటెక్, శివమ్ టెక్నాలజీ దుకాణాల్లో మంటలు**
**సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక, హైడ్రా సిబ్బంది, పోలీసులు**
**ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్న అధికారులు**




హైదరాబాద్, జై భీమ్ న్యూస్

హైదరాబాద్‌లోని అమీర్‌పేట చౌరస్తా మైత్రివనం వద్ద ఉన్న ఆదిత్య ఎన్‌క్లేవ్ భవనం మొదటి అంతస్తులో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. నీలగిరి బ్లాక్‌లోని రాందేవ్ ఇన్ఫోటెక్, శివమ్ టెక్నాలజీ దుకాణాలలో మంటలు అలముకున్నాయి. ఈ భవనంలో కోచింగ్ సెంటర్‌లు ఉంటాయి. దీనితో ఆయా కోచింగ్ సెంటర్‌లలోని విద్యార్థులు కిందకు వచ్చేశారు. విద్యార్థులను పోలీసులు, హైడ్రా సిబ్బంది నిచ్చెనల ద్వారా కూడా సురక్షితంగా తీసుకువచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేసింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. ప్రమాదం విషయం తెలియగానే పోలీసులు, అగ్నిమాపక సిబ్బందితో పాటు హైడ్రా సిబ్బంది హుటాహుటిన మైత్రివనంకు తరలి వచ్చారు. గ్రౌండ్ ఫ్లోర్‌లోని ప్యానెల్ బోర్డులో షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. మొదటి అంతస్తు వరకు మంటలు రావడం, పొగలు రెండో అంతస్తు వరకు వ్యాపించడంతో భవనాన్ని ఖాళీ చేయించారు.

# కాంగ్రెస్ నిరసనలపై జగన్ ట్వీట్...

**జగన్ నకిలీ సానుభూతి ప్రదర్శిస్తున్నారని లోకేశ్ ఎద్దేవా**

ఢిల్లీ, జై భీమ్ న్యూస్

ఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చొక్కాలు విప్పి నిరసన తెలిపిన వ్యవహారం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై వైసీపీ అధినేత జగన్ ట్వీట్ చేయడం తెలిసిందే. "ఏఐ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ప్రవర్తించిన తీరు సిగ్గుచేటు. మన రాజకీయాలు ఎటు వెళ్తున్నాయి? రాజకీయ విభేదాలు ఎలా ఉన్నా, ప్రపంచం ముందు దేశం పరువు తీయకూడదు" అని జగన్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. దేశం విషయంలో అందరం ఐక్యంగా నిలబడాలని హితవు పలికారు. జగన్ వ్యాఖ్యలపై మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. అసలు దేశ ప్రతిష్ఠ గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదంటూ విరుచుకుపడ్డారు. జగన్ హిపోక్రసీ (కపటత్వం) అమోఘమని లోకేశ్ ఎద్దేవా చేశారు. "భారతదేశ పెట్టుబడుల వాతావరణాన్ని అందరికంటే ఎక్కువగా దెబ్బతీసిన వ్యక్తి, ఇప్పుడు నకిలీ సానుభూతి ప్రదర్శిస్తున్నారు" అని విమర్శించారు. ఈ సందర్భంగా జగన్ గతంలో తీసుకున్న పలు నిర్ణయాలను లోకేశ్ ప్రస్తావించారు. 2017లో ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌ను అడ్డుకునేందుకు ఎయిర్‌పోర్టులో ధర్నా చేయడం, 2019లో విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయడం, 2020లో అమరావతిలో సింగపూర్ ప్రభుత్వ పెట్టుబడులను వెనక్కి పంపడం, 2025లో ప్రభుత్వ నిధుల సమీకరణను అడ్డుకోవాలని ఆర్‌బీఐకి లేఖ రాయడం వంటి చర్యలను గుర్తుచేశారు. ఇప్పుడు ఏఐ సమ్మిట్ గురించి ఆందోళన చెందుతున్నట్లు నటించడం విడ్డూరంగా ఉందని లోకేశ్ వ్యాఖ్యానించారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE



# యూట్యూబర్ ‘నా అన్వేషణ’ అన్వేష్ కు షాక్..

**ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ బ్యాన్**
**ఇండియా గురించి అనుచిత వ్యాఖ్యలు చేసిన అన్వేష్**
**అన్వేష్ పై సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేసిన కరాటే కల్యాణి**
**పోలీసుల సూచన మేరకు అన్వేష్ అకౌంట్ బ్యాన్ చేసిన ఇన్‌స్టాగ్రామ్**

ప్రపంచవ్యాప్త ట్రావెల్ వీడియోలతో సంచలనం సృష్టించిన తెలుగు యూట్యూబర్ ‘నా అన్వేషణ’ అన్వేష్ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ఒక్కసారిగా కనుమరుగైంది. 1.3 మిలియన్ (13 లక్షలు) ఫాలోవర్స్ ఉన్న ఈ అకౌంట్ బ్యాన్ కావడం చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే... గతంలో అన్వేష్ తన వీడియోల్లో భారతదేశాన్ని దూషించారని నటి కరాటే కల్యాణి సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు విచారణ చేపట్టి, మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా, దేశ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా పోస్టులు ఉన్నట్లు గుర్తించారు. ముందుగా ఇన్‌స్టాగ్రామ్ యాజమాన్యానికి లేఖ రాసి అకౌంట్ వివరాలు సేకరించారు. తర్వాత మరో లేఖలో విద్వేషపూరిత కంటెంట్ ఉందని, తక్షణమే అకౌంట్ తొలగించాలని కోరారు. ఇన్‌స్టాగ్రామ్ యాజమాన్యం పోలీసుల లేఖపై స్పందిస్తూ... అన్వేష్ అకౌంట్‌ను క్షుణ్ణంగా పరిశీలించింది. నిబంధనల ఉల్లంఘన నిర్ధారణ అయిన వెంటనే బ్యాన్ చేసింది. ప్రస్తుతం అకౌంట్ సెర్చ్ రిజల్ట్స్‌లో కనిపించడం లేదు.

# నాకు కూడా ప్రేమలో పడాలని ఉంది: ప్రభాస్

**‘కపుల్ ఫ్రెండ్లీ’ టీమ్ తో ముచ్చటించిన ప్రభాస్**
**ప్రేమపై అభిప్రాయం ఏమిటని ప్రభాస్ ను ప్రశ్నించిన మానస వారణాసి**
**ఆ మూమెంట్ కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నానన్న ప్రభాస్**



ఇప్పటివరకు పెళ్లి గురించి అడిగితే నవ్వేసి దాటవేసేవాడు రెబల్ స్టార్ ప్రభాస్. అనుష్క నుంచి కృతి సనన్ వరకు ఎన్నో పేర్లు లింక్ అయినప్పటికీ... ఆయన ఒక్కసారి కూడా సీరియస్ గా సమాధానం ఇవ్వలేదు. ఇప్పుడు మొదటిసారిగా ఆయన మనసులోని అసలు కోరికను బయటపెట్టి... అందరినీ ఆశ్చర్యానికి గురి చేశాడు. టాలీవుడ్ లో తాజాగా విడుదల అయిన ‘కపుల్ ఫ్రెండ్లీ’ సినిమా మంచి టాక్ తెచ్చుకుంది. మరోవైపు, ఈ మూవీ టీమ్‌తో ప్రభాస్ ప్రత్యేకంగా ముచ్చటించాడు. ఈ ఇంటర్వ్యూలో హీరోయిన్ మానస వారణాసి ప్రభాస్ ను ఒక ప్రశ్న సూటిగా అడిగేసింది: “ప్రేమపై మీ అభిప్రాయం ఏంటి డార్లింగ్?” అని ఆమె ప్రశ్నించగా... ప్రభాస్ కాసేపు సిగ్గుపడ్డాడు. ఆ తర్వాత “ఇది నీ పర్సనల్ క్వశ్చన్ కదా” అని మొదలెట్టి, తర్వాత ఇలా చెప్పేశాడు. “నిజం చెప్పాలంటే... నాకు కూడా ప్రేమలో పడాలని ఉంది. ఆ అద్భుతమైన ఫీలింగ్ ను అనుభవించాలని ఉంది. ఆ మూమెంట్ కోసం నేను కూడా ఆత్రుతగా ఎదురుచూస్తున్నాను” అని చెప్పాడు. ప్రభాస్ వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ఇక సినిమాల విషయానికొస్తే... ప్రభాస్ ఇప్పుడు వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నాడు. సలార్-2, స్పిరిట్, ఫౌజీ, కల్కి-2 వంటి ప్రాజెక్ట్స్ చేస్తున్నాడు.



# ‘కాక్ టెయిల్ 2’లో రష్మిక పాత్రపై వైరల్ న్యూస్

**లెస్బియన్ జంటగా కృతి సనన్, రష్మిక!**
**ట్రయాంగిల్ లవ్ స్టోరీగా కాక్ టెయిల్ 2**
**జనవరి 31న షూటింగ్ పూర్తి.. త్వరలో రిలీజ్**

వరుస విజయాలతో దూసుకుపోతున్న రష్మిక మందన్న, ఇప్పుడు మరో ప్రయోగాత్మక పాత్రతో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు. బాలీవుడ్‌లో మోస్ట్ అవేటెడ్ మూవీగా భావిస్తున్న ‘కాక్‌టెయిల్ 2’లో ఆమె పోషిస్తున్న పాత్ర గురించి ప్రస్తుతం సోషల్ మీడియాలో ఒక ఆసక్తికరమైన వార్త వైరల్ అవుతోంది. షాహిద్ కపూర్ ప్రధాన పాత్రలో రానున్న ఈ చిత్రంలో కృతి సనన్, రష్మిక మందన్న కీలక పాత్రలు పోషిస్తున్నారు. బాలీవుడ్ మీడియా సమాచారం ప్రకారం.. ఈ సినిమాలో వీరిద్దరూ స్వలింగ ప్రేమికులుగా కనిపించనున్నట్లు తెలుస్తోంది. దీనిపై అధికారిక సమాచారం రాకపోయినప్పటికీ వీరి పాత్రల గురించి ప్రచారం మాత్రం జోరుగా సాగుతోంది. ఇదొక విభిన్నమైన ట్రయాంగిల్ లవ్ స్టోరీ అని, రష్మిక-కృతి పాత్రల మధ్య కెమిస్ట్రీ సినిమాకే హైలైట్‌గా నిలవనుందని టాక్ వినిపిస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన రాకపోయినప్పటికీ, ఈ వార్త సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. హోమీ అదజానియా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ జనవరి 31వ తేదీతో పూర్తయింది. 2012లో సైఫ్ అలీ ఖాన్, దీపికా పదుకొణె నటించిన సూపర్ హిట్ ‘కాక్‌టెయిల్’ చిత్రానికి ఇది సీక్వెల్‌గా వస్తోంది. ఈ సినిమాలో షాహిద్ మునుపెన్నడూ చూడని సరికొత్త లుక్‌లో కనిపిస్తారని దర్శకుడు వెల్లడించారు. త్వరలోనే ఈ మూవీ రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తామని చెప్పారు. విభిన్న పాత్రలతో తన మల్టీటాలెంట్‌ను నిరూపించుకుంటున్న రష్మికకు, ఈ ‘కాక్‌టెయిల్ 2’ బాలీవుడ్‌లో మరో పెద్ద బ్రేక్ ఇస్తుందేమో చూడాలి.

HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEEM,TV.COM